## పీటీసీ ప్రిన్సిపల్‌గా రాధిక



ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ) ప్రిన్సిపల్‌గా జి.ఆర్.రాధిక సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఇప్పటి వరకు రాష్ట్ర పోలీసు కేంద్రంలో వెయిటింగ్‌లో ఉన్నారు. అంతకుముందు శ్రీకాకుళం ఎస్పీగా పనిచేశారు. పీటీసీ ప్రిన్సిపల్‌గా ఒంగోలులో బాధ్యతలు స్వీకరించిన రాధిక.. అనంతరం జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.

## భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవాన్ని కంభంలో సోమవారం రాత్రి నుంచి ఉదయం 9 గంటల వరకు కనులపండువగా నిర్వహించారు. కళాకారుల వేషధారణలు, విచిత్ర అలంకరణలు, కోలాటం, కేరళ వాయిద్యాలు, డప్పు దరువుల మధ్య ఊరేగింపు ఆద్యంతం సందడిగా సాగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పూజలు చేసి తమను చల్లగా చూడాలంటూ మొక్కుకున్నారు. – న్యూస్‌టుడే, కంభం



# లాటరీ వీరులు

- 171 దుకాణాలకు 3,466 దరఖాస్తులు
- పారదర్శకంగా వ్యవహరించిన అధికారులు
- ఈ నెల 16 నుంచి మద్యం విక్రయాలు



టోకెన్ చూపుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా.. పక్కన జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, ఎక్సైజ్ అధికారులు



దరఖాస్తుదారులు, సహాయకులతో కిటకిటలాడుతున్న అంబేడ్కర్ భవన్‌లోని సమావేశ మందిరం

ఈనాడు, ఒంగోలు: జిల్లాలోని ప్రైవేట్ మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించి ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో సోమవారం లాటరీ ప్రక్రియ నిర్వహించారు. మొత్తం 171 దుకాణాలకు గాను 3,466 దరఖాస్తులు వచ్చాయి. కౌంటర్ నంబరు 1లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, కౌంటర్ నంబరు 2లో జేసీ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ కొనసాగింది. ఔత్సాహికులకు టోకెన్ నంబర్లు కేటాయించి ఒక పెట్టెలో వేశారు. లాటరీలో మొదట వచ్చిన వారికి దుకాణం కేటాయించారు. ఇందులో కొందరు మహిళలనూ అదృష్టం వరించగా., ఇంకొందరికి రెండు, అంతకంటే ఎక్కువ దుకాణాలు లభించాయి. ప్రక్రియ నిర్వహణలో పారదర్శకంగా వ్యవహరించారు. ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేసి అందరూ తిలకించేలా ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మోహిద్దీన్ మాట్లాడుతూ.. లాటరీలో దుకాణాలను దక్కించుకున్నవారు నిర్ణీత రుసుములో తొలుత ఆరోవంతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. లేకుంటే వాటిని రిజర్వ్‌లోని రెండు, మూడు నంబర్లు వచ్చిన వారికి కేటాయించే అవకాశం కల్పిస్తామన్నారు. ఈ నెల 15న ప్రైవేట్ వ్యక్తులకు దుకాణాలు అప్పగిస్తామని, 16వ తేదీ నుంచి కొత్త మద్యం విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు.

**14 మంది అదృష్ట లక్ష్ములు...:** సింగరాయకొండ పరిధిలోని 53 నంబరు మద్యం దుకాణం ఒంగోలుకు చెందిన తిరుమలశెట్టి వాసవికి దక్కింది. చీమకుర్తి పరిధిలోని 43వ నంబరు దుకాణం మలినేని సంధ్యను వరించింది. కొత్తపట్నంలోని 24 నంబరు దుకాణం అదే గ్రామానికి చెందిన హిమశృతికి లభించింది. వీరే కాకుండా అంగరెల్లి దయాన(ఒంగోలు), గుమ్మడి నాగపద్మిని(ఒంగోలు), కోయ సుస్మిత(టంగుటూరు), కూనం సత్యవాణి(సింగరాయకొండ), బి.సంధ్యారాణి(జరుగుమల్లి), వరికూటి లక్ష్మీతాయారు(కొనకనమిట్ల), ధూళిపాళ్ల రమ్యకృష్ణ(దర్శి), కూనం సత్యవాణి(దర్శి), పిడతల పద్మజ(గిద్దలూరు), ఏవీ.సుభాషిణి(కంభం), కోయ రాజ్యలక్ష్మీదేవి(అర్థవీడు)లకు దుకాణాలు దక్కాయి.



వర్షపు నీటిలో మునిగిన భాగ్యనగర్‌లోని రహదారులు



ఒంగోలు నగరంలోని ఎగ్జిబిషన్ ప్రాంగణం వద్ద నిలిచిన నీరు

# ముసురు.. వణుకు

- పొన్నలూరులో అత్యధిక వర్షపాతం
- మరో నాలుగు రోజులు అప్రమత్తం
- నేడు విద్యా సంస్థలకు సెలవు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ నెల 16వ తేదీ వరకు భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిక చేసిన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. విద్యుత్తులు ఎర్పాట్లు నేల కోస్తా తీర ప్రాంత మండలాల్లో ముందస్తు సహాయక చర్యలు చేపట్టింది. జిల్లా అధికారులతో పాటు, మండల తహసీల్దార్లు పలు గ్రామాల్లో సోమవారం పర్యటించారు.

**ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు...:** భారీ వర్షాల దృష్ట్యా కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లా, మండల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. మరో నాలుగు రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తీర ప్రాంత మండలాల అధికారులు పరిస్థితిని నిశితంగా గమనిస్తూ ఉండాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల దృష్ట్యా వరుసగా రెండో రోజైన మంగళవారం కూడా జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా అప్రమత్తం చేశారు.

**పునరావాస కేంద్రాలకు తరలింపు...**

ఒంగోలు నగరంతో పాటు, తీరప్రాంత గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలపై అధికారులు దృష్టి సారించారు. అందులో నివాసం ఉండే వారిని అవసరాన్ని బట్టి పునరావాస కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సామాజిక భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు వంటి సురక్షిత కేంద్రాలకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. మండలాల వారీగా సోమవారం కొత్తపట్నం(09), టంగుటూరు(35), నాగులుప్పలపాడు(30).. మొత్తం 74 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. అక్కడే భోజనం ఏర్పాటు చేశారు. టంగుటూరు మండలం ఆలకూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాల పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం సందర్శించారు.

**జిల్లాలోని మండలాల్లో వర్షపాతం (మిల్లీ మీటర్లలో)** (ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు)

| మండలం | వర్షపాతం |
|---|---|
| పొన్నలూరు | 118.0 |
| ఒంగోలు | 113.8 |
| సింగరాయకొండ | 111.4 |
| జరుగుమల్లి | 98.2 |
| సీఎస్‌పురం | 96.2 |
| టంగుటూరు | 86.2 |
| కొండపి | 78.8 |
| కొత్తపట్నం | 74.2 |
| పామూరు | 69.8 |
| పీసీపల్లి | 68.4 |
| నాగులుప్పలపాడు | 55.6 |
| సంతనూతలపాడు | 53.6 |
| మద్దిపాడు | 52.2 |
| హనుమంతునిపాడు | 50.6 |
| తాళ్లూరు | 50.2 |





టంగుటూరు మండలం ఆలకూరపాడులోని పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

# ఆ అధికారే అడవి దొంగ!



- పట్టుకున్న ఎర్రచందనం దుంగలు మాయం
- నిబంధనలు కాదని ఇష్టారీతిన బదిలీల పర్వం
- సిబ్బందిని నియమించుకుని వసూళ్ల బాగోతం

వనాన్ని.. అందులోని ప్రాణులను రక్షించాల్సిన ఉన్నతాధికారే అడవి దొంగ అవతారమెత్తారు. తన భుజ స్కంధాలపై ఉన్న బృహత్తర బాధ్యతను విస్మరించారు. పట్టుకున్న దొంగ సొత్తునూ దారి మళ్లించి దిగమింగారు. ప్రభుత్వ ఉత్తర్వులనూ కాదని ఇష్టారీతిన వ్యవహరించారు. సిబ్బందిలో కొందరిని తన అనుయాయులుగా మలచుకుని అందిన కాడికి దండుకోవడానికి తెగబడ్డారు. అదేమని అడిగిన ఇతరులను వేధింపులకు గురిచేయడం అలవాటుగా మార్చుకున్నారు. మార్కాపురం అటవీ శాఖలో పని చేస్తున్న సదరు ఉన్నతాధికారి తీరుపై ఉద్యోగులిప్పుడు మండిపడుతున్నారు. చూస్తూ పోతే నల్లమలనే నాశనం చేస్తారంటూ ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, అటవీ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శికి కలిసికట్టుగా అతని అక్రమాల పరంపరపై ఫిర్యాదు చేశారు. ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేయిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని విన్నవించారు. – న్యూస్‌టుడే, మార్కాపురం

**సంద్ర దుంగలతో మస్కా...:** మార్కాపురానికి చెందిన సదరు ఉన్నతాధికారి మాచర్ల పరిధిలో మొత్తం 211 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు. అనంతరం వాటిని తిరుపతి డిపోనకు తరలించాల్సి ఉంది. సదరు అధికారి మాత్రం వాటిని తరలించకుండా ఆరు నెలల పాటు కాలయాపన చేశారు. ఆ తర్వాత 211 దుంగల్లో 133 మాత్రమే తిరుపతి పంపారు. మిగిలిన వాటిని మాయం చేశారు. ఆ స్థానంలో ఎరుపు రంగులో కనిపించే సంద్ర దుంగలను పెట్టారు.

**అతని సాయంతో మామూళ్లు...:** మార్కాపురం డివిజన్ కేంద్రంలో పని చేస్తున్న ఓ గార్డును సదరు అధికారి తన తరఫున అక్రమాలు సాగించేందుకు నియమించుకున్నారు. అతను అన్ని టింబర్ డిపోల వద్దకు వెళ్లి నెల నెలా మామూళ్లు వసూలు చేసేవారు. యర్రగొండపాలెం రేంజ్ పరిధిలోని ఒక టింబర్ డిపో యజమానిని వేధించి సుమారు రూ.3 లక్షలు దండుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా టేకు మొద్దులు తరలిస్తున్నా ముడుపులు తీసుకుని కిమ్మనేవారు కాదు. సదరు ఉద్యోగి దాదాపు పదేళ్లుగా ఒకే రేంజ్‌లో పని చేస్తూ భారీగా అక్రమాలకు పాల్పడ్డారు.

**జీపునే అమ్మేసుకున్నారు...:** ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను కాదని ఉద్యోగుల బదిలీల్లో ఆ అధికారి తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారు. తన అధికారిక నివాసానికి ఎటువంటి అనుమతులు లేకుండా సుమారు రూ.25 లక్షల ప్రజాధనంతో అదనపు హంగులు సమకూర్చుకున్నారు. నెక్కంటి అటవీ సెక్షన్‌లో పాతాళగంగ వద్ద ఉన్న అటవీ శాఖ పడక ఒకటి నీటిలో కొట్టుకుపోయి సుమారు రూ.13 లక్షల మేర నష్టం వాటిల్లింది. ఈ ఉదంతంపై ఇప్పటి వరకు ఎలాంటి విచారణ చేపట్టలేదు. దోర్నాల రేంజ్‌లో ఒక అధికారి ప్రభుత్వ జీపునే అనధికారికంగా అమ్మేసుకున్నారు.

**లంచమిస్తేనే ప్రయోజనాలు...:** పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ ఆర్థిక ప్రయోజనాలు పొందాలంటే డివిజన్ కార్యాయంలో సుమారు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లించుకోవాలి. వేసవిలో అవగాహన సదస్సుల పేరుతో ఒక్కొక్క రేంజ్ నుంచి రూ. లక్షల ప్రభుత్వ నిధులు డ్రా చేశారు. డివిజన్‌కు ఒకటీ రెండు చోట్ల మాత్రమే సదస్సులు పెట్టి మిగిలిన నిధులను సొంతానికి వాడుకున్నారు. ప్రశ్నించే పలువురు ఉద్యోగులను మానసికంగా వేధింపులకు గురిచేశారు.

## సచివాలయ బదిలీల్లో అక్రమాలు

- డీపీవో పూర్వ ఏవోపై కేసు నమోదు

ఈనాడు కథనానికి స్పందన

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ కార్యాలయ పరిపాలనాధికారి ఎస్.శివప్రసాద్‌పై ఒంగోలు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 11న నమోదైనప్పటికీ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. జిల్లాలోని సచివాలయ కార్యదర్శుల నియామకాల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. పెద్దఎత్తున నగదు చేతులు మారాయి. ముడుపులు తీసుకుని ఉద్యోగులకు ఉత్తర్వులు అందించారు. ఈ విషయాన్ని తెలుపుతూ 'నగదు ఇవ్వు.. లేఖ తీసుకెళ్లు' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనికి కలెక్టర్ తమీమ్ అన్సారియా స్పందించి విచారణకు ఆదేశించారు. ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదించారు. అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డీపీవో గొట్టిపాటి వెంకట నాయుడును కలెక్టర్ ఆదేశించారు. ఆయన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్యాలెస్ బంటులు X దామోదర్

నరసాపురం మాజీ ఎంపీ, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును సీఐడీ కేసులో చిత్రహింసలకు గురిచేసి హత్య చేయడానికి యత్నించారనే విషయం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ వ్యవహారంలో తాడేపల్లి ప్యాలెస్ బంటులుగా పేరొందిన కొందరు పోలీసు అధికారుల పాత్ర ఉందనే విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక రఘురామకృష్ణంరాజు ఫిర్యాదు మేరకు ఎట్టకేలకు కేసు నమోదైంది. ఎంతో కీలకంగా పరిగణించే ఈ కేసు దర్యాప్తు బాధ్యతను జిల్లా ఎస్పీ దామోదర్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

- ఎస్పీ చేతికి ఆర్ఆర్ఆర్ చిత్రహింసల కేసు
- రాజీ పడని మనస్తత్వంతోనే దర్యాప్తు బాధ్యతలు



**నిందితులు హేమాహేమీలు...:** గత వైకాపా ప్రభుత్వ హయాంలో కీలకంగా వ్యవహరించిన నాటి సీఐడీ చీఫ్ పి.వి.సునీల్ కుమార్, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన సీతారామాంజనేయులు, మాజీ సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి, కేసు దర్యాప్తు అధికారి, విశ్రాంత అదనపు ఎస్పీ విజయ్‌పాల్, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభావతి ఇందులో కీలక నిందితులు. వీరిలో అత్యధికులు శక్తిమంతమైన వ్యక్తులు. అప్పట్లో రఘురామకృష్ణంరాజుపై నమోదైన కేసు విచారణాధికారిగా విజయ్‌పాల్ వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తనపై కేసు నమోదు కావడంతో ఆయన కొన్నాళ్లపాటు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కోర్టు ఉత్తర్వులతో ఇటీవల విచారణకు హాజరవుతున్నారు. సహకరించకుండా అరకొర సమాధానాలతో సరిపెడుతున్నారు. నిందితులంతా హేమాహేమీలు కావడం, దర్యాప్తు నత్తనడకన సాగుతుండటం, కీలక నిందితుడు సహకరించకపోవడం వంటి ఉదంతాలతో సదరు బాధ్యతలను దామోదర్‌కు అప్పగించారనే చర్చ సాగుతోంది.

**పనితీరుతోనే ప్రభుత్వం మొగ్గు!:** ఎస్పీ దామోదర్ కేసుల దర్యాప్తును సీరియస్‌గా పరిగణిస్తారు. రాజీ పడకుండా, ముక్కుసూటిగా వ్యవహరిస్తారనే పేరుంది. డీఎస్పీగా పనిచేసిన రోజుల నుంచి అదే తీరు. ఒంగోలులో శిక్షణ డీఎస్పీ వ్యవహరించిన రోజుల్లోనే జాతీయ రహదారిపై హత్యలకు పాల్పడుతున్న మున్నా ముఠాను అరెస్టు చేసిన నేపథ్యం ఉంది. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రౌడీయిజంపై ఉక్కుపాదం మోపుతున్నారు. దీంతో అత్యంత కీలకమైన రఘురామకృష్ణం రాజు కేసు దర్యాప్తునకు ప్రభుత్వం ఎస్పీ దామోదర్ వైపు మొగ్గు చూపి ఉంటుందని భావన. – న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం



రూ.30.85 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు, నాయకులు

## వరద బాధితులకు చేయూత

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు యర్రగొండపాలెం నియోజకవర్గ తెదేపా నేతలు స్పందించారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం నాయకులు, కార్యకర్తలు, వివిధ సంస్థల నుంచి రూ.30.85 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని వెలగలపూడిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఈ మేరకు నాయకులను సీఎం అభినందించారు. అనంతరం నియోజకవర్గ నాయకులను సీఎంకు ఎరిక్షన్‌బాబు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టం శ్రీనివాస రెడ్డి, ఎస్కే.మాబు, సత్యనారాయణ గౌడ్, చేకూరి సుబ్బారావు, కాకర్ల కోటయ్య, శనగా నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మత్తులో యువత.. వ్యసనానికి విముక్తి లేదిక్కడ

- సమస్యలతో కునారిల్లుతున్న కేంద్రం
- నామమాత్రంగా అందుతున్న సేవలు



న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

- ఒంగోలు వైద్య కళాశాలకు చెందిన కొందరు విద్యార్థులు గంజాయికి అలవాటు పడ్డారు. మత్తులో జోగుతూ నానా రభస సృష్టించారు. అదేమని అడిగిన తోటి విద్యార్థులతో గొడవలకు దిగారు.. దాడులు చేశారు. ఈ విషయం కొద్ది నెలల క్రితం తీవ్ర సంచలనమైంది.
- గత సార్వత్రిక ఎన్నికల సమయంలో వైకాపా వర్గీయులు కొందరు ఒంగోలు రిమ్స్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. రోగులు చికిత్స పొందే వార్డుల్లోకి వెళ్లి వీరంగం వేశారు. గదులకు ఉన్న అద్దాలు ధ్వంసం చేశారు. గంజాయికి అలవాటు పడిన కొందరు యువత ఆ మత్తులో ఈ విధ్వంసానికి కారణమైనట్లు పోలీసులు గుర్తించారు.
- ఒంగోలులోని అప్పాయికుంటలో గత ఏడాది సీతారామాంజనేయుల తెప్పోత్సవం నిర్వహించారు. వేడుక అనంతరం స్వామివార్ల విగ్రహాలను భక్తులు ఆలయానికి తెస్తుండగా వారిపై గంజాయి మత్తులో ఊగిపోతున్న పైశాచిక మూక దాడి చేసింది. ఏకంగా స్వామి వారి విగ్రహంపై మద్యం పోసి వికృతానందం పొందింది.
- చీమకుర్తి మండలం బూదవాడలో గంజాయిని చాక్లెట్ల రూపంలో విక్రయిస్తుండగా పోలీసులు అప్పట్లో దాడి చేసి పట్టుకున్నారు.

**వెంటాడుతున్న నాటి నిర్లక్ష్యపు చీడ...:** వైకాపా పాలనలో జిల్లావ్యాప్తంగా గంజాయి విక్రయాలు జోరుగా సాగాయి. ఏకంగా పిచ్చి మందు(నాణ్యత లేని మద్యం) విక్రయించిందనే విమర్శలున్నాయి. అడ్డుకునేవారు లేక మత్తు రక్కసి మారుమూల పల్లెలకూ చేరింది. ఒంగోలు వైద్య కళాశాల కూడా ఆ పొగతో మసిబారింది. ఫలితంగా ఎందరో యువకులు మత్తు కోరల్లో చిక్కుకున్నారు. బంగారు భవిష్యత్తు ఉన్న పిల్లలెందరో జీవచ్ఛవాలుగా మారారు. కుటుంబాలకు ఆసరా కావాల్సిన వారు నేరగాళ్ల అవతారమెత్తారు. మద్యం తాగిన పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఎందరో అనారోగ్యం బారిన పడ్డారు. మత్తు వ్యసనం నుంచి తమ వారిని కాపాడుకునేందుకు కుటుంబ సభ్యులు చేసిన ప్రయత్నాలూ ఫలించలేదు. అందుకు జిల్లాలో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ సెంటర్‌లో సరైన సౌకర్యాలు లేకపోవడం, వైద్యులు, సిబ్బంది కొరత ఓ కారణం. గత ప్రభుత్వం వహించిన నిర్లక్ష్యం ఒంగోలు సర్వజన ఆసుపత్రిలోని వ్యసన విముక్తి కేంద్రాన్ని ఇప్పటికీ ఓ చీడలా వెంటాడుతోంది.

**మందులు బయట కొనుక్కోవాలట...**

వారానికి సుమారు అయిదు ఓపీలు నమోదవుతున్నాయి. నెలలో ముగ్గురు, నలుగురు ఇన్‌పేషంట్లుగా చేరి చికిత్స పొందుతున్నారు. వారికి కొన్ని ఖరీదైన మందులు అవసరం. సెంట్రల్ డ్రగ్ స్టోర్ ద్వారా అలాంటివి సరఫరా కావడం లేదు. స్థానికంగా కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఉన్నా.. బడ్జెట్ లేదు. దీంతో బయట కొనుగోలు చేసుకోవాలని రోగుల బంధువులకు సిబ్బంది సూచిస్తున్నారు. పేదలకు ఇది భారంగా మారింది. సిబ్బందికి వేతనాలు చెల్లించి అన్ని సౌకర్యాలతో కేంద్రాన్ని పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉంది.




| పోస్టు | సిబ్బంది అవసరమైనది | సిబ్బంది ఉన్నది |
|---|---|---|
| వైద్యాధికారి | 01 | 0 |
| సైకియాట్రిస్ట్ | 01 | 0 |
| నర్సులు | 02 | 02 |
| వార్డు బాయ్స్ | 02 | 01 |
| కౌన్సిలర్లు | 03 | 02 |
| డేటా ఎంట్రీ ఆపరేటర్ | 01 | 01 |

- జీజీహెచ్‌లోని కేంద్రంలో రెండేళ్లుగా వైద్యాధికారి లేరు. మానసిక వైద్యవిభాగం హెచ్‌వోడీ ఈ విభాగానికి బాధ్యుడిగా వ్యవహరిస్తూ అడపాదడపా సేవలందిస్తున్నారు)
- సైకియాట్రిస్ట్ పోస్టు భర్తీకి ఇప్పటికి మూడుసార్లు ప్రకటన ఇచ్చినా ఎవరూ ముందుకు రాలేదు
- కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి 14 నెలలుగా వేతనాలు అందడం లేదు

# రూ.కోట్ల వ్యయం.. లీకేజీలమయం

## ◗ వైకాపా హయాంలో నాసిరకంగా నిర్మాణం ◗ కంభం వైద్యశాల సొగసిదీ !

**రోగులకు సంజీవనిగా ఉండే ఆసుపత్రి నిర్మాణంలోనూ కాసులకు కక్కుర్తి పడ్డారు. ఫలితంగా రూ.కోట్లు వెచ్చించి నిర్మించినా.. చిరు జల్లులకే నీరంతా లీకై నాటి పాలకుల అవినీతికి అద్దం పడుతోంది కంభం ఆసుపత్రి!**

న్యూస్‌టుడే, కంభం :

గత ప్రభుత్వ హయాంలో కంభంలోని ముప్పై పడకల స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని యాభై పడకల ఆసుపత్రిగా మార్పు చేశారు. అందుకు అనుగుణంగా రూ.3 కోట్లతో అదనపు భవనాన్ని నిర్మించారు. పాలకుల అండదండలతో నాటి గుత్తేదారు సంస్థ పనుల్ని ఇష్టారాజ్యంగా చేపట్టింది. ఎన్నికల ముందు ఆదరాబాదరాగా చేయడంపై నాటి వైకాపా ఎమ్మెల్యే అన్నా రాంబాబు సైతం బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేసినా పాలకులు పెడచెవిన పెట్టారు. ప్రస్తుతం నూతన భవనం ముందుభాగమంతా నీరుకారుతోంది. పైభాగం నుంచి లీకవుతున్న నీటితో ఆ ప్రాంతమంతా మడుగులా మారుతోంది. పాత, కొత్త భవనాన్ని కలిపే ప్రదేశంలోనూ ఇదే పరిస్థితి. కొన్ని గదులకు బిగించిన తలుపులు సరిగా పడడం లేదు. మరుగుదొడ్లలోని సింకులు పగిలిపోయాయి. చెత్తా చెదారం, ఇసుక, వ్యర్థాల దిబ్బలతో ఆసుపత్రి ప్రాంగణం అపరిశుభ్రంగా ఉంది. వైద్యశాల ప్రాంగణంలోనే పిల్లచెట్లు విపరీతంగా పెరిగిపోయాయి.



పాత, కొత్త భవనాలను కలిపే చోట చెమ్మగిల్లిన దృశ్యం

అలంకారప్రాయంగా ఆర్వో ప్లాంట్



కొత్త భవనం వరండాలో నిలిచిన నీరు

### ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు నిధులు లేవు..

పశ్చిమ ప్రాంతం నుంచి నిత్యం 300కు పైగా రోగులు ఈ వైద్యశాలకు వస్తుంటారు. ఇన్‌పేషంట్లు సుమారు 40 మంది వరకు ఉంటారు. ఇక్కడ ఉన్న శుద్ధజల కేంద్రం మరమ్మతులకు గురైనా నిధులు లేవంటూ పట్టించుకోవడం లేదు. జనరేటర్ పాతది కావడంతో ఆసుపత్రి అంతటికీ విద్యుత్తు సరఫరా చేయడం కష్టంగా ఉంది. దీనిపై కంభం వైద్యశాల సూపరింటెండెంట్ శివనాయక్‌ను వివరణ కోరగా, ఇటీవల ఇంజినీరింగ్ అధికారులు వచ్చి పనులను పరిశీలించి అసంతృప్తిగా వ్యక్తంచేశారన్నారు. అప్పటి ప్రభుత్వంలోని ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు భవనాన్ని తీసుకోవాల్సి వచ్చిందన్నారు.

# బూడిద గుమ్మడి... భలే రాబడి

న్యూస్‌టుడే - ఒంగోలు కర్నూలు రోడ్డు



కొత్తపట్నం మండలంలో చామ, చిలగడ దుంప; ఆకుకూరలు, కూరగాయల సాగు ఎక్కువ. అందుకు భిన్నంగా బూడిద గుమ్మడి సాగు చేపట్టి మంచి ఫలితాలు సాధించారు.. ఈతముక్కల గ్రామానికి చెందిన రైతు పఠాన్ లాలూఖాన్. మొత్తం పదిహేను ఎకరాల్లో ఈ పంట వేశారు.

### పండించింది ఇలా...

ముందుగా పొలాన్ని దుక్కులు దున్ని సాగుకు అనుకూలంగా సిద్ధం చేశారు. కిలో రూ.1,300 చొప్పున బాపట్ల జిల్లా అద్దంకిలో విత్తనాలు సేకరించారు. ఎకరానికి కిలోన్నర చొప్పున.. ఈ ఏడాది జూన్‌లో నాటారు. తరువాత పక్షం రోజులకు ఎకరాకు ఓ బస్తా చొప్పున యూరియా చల్లారు. నెలన్నర తరువాత మరో సారి ఇదే మోతాదులో యూరియా వేశారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నీటి తడులు అందించారు. మిగతా పంటలతో పోలిస్తే తెగుళ్ల, చీడ పీడల బెడద గుమ్మడికి పెద్దగా ఉండదని... అందువల్ల సస్యరక్షణ చర్యలు పెద్దగా చేపట్టాల్సిన అవసరం లేకపోయిందని రైతు తెలిపారు. మూడు నెలలకు మంచి పరిమాణంలో నాణ్యమైన కాయలు దిగుబడిగా వచ్చాయి.

### పొలం వద్దే కొనుగోళ్లు...

ఎకరాకు సాగు వ్యయం రూ.12 వేల మేర అయినట్టు రైతు చెప్పారు. దిగుబడి సగటున ఎనిమిది టన్నులు లభించిందని తెలిపారు. ఒంగోలు, పరిసర ప్రాంత వ్యాపారులు పొలం వద్దకే వచ్చి కొనుగోలు చేశారని... అన్ని ఖర్చులు పోనూ ఎకరాకు రూ.40 వేల మేర ఆదాయం వచ్చిందని వివరించారు. సొంతంగా మార్కెట్ చేసుకోగలిగితే మరింత లాభం పొందే అవకాశం ఉందన్నారు. ఎవరైనా ఈ సాగు చేపట్టవచ్చని... నష్టభయం పెద్దగా ఉండదని తన అనుభవంతో చెప్పారు.

### సమస్య - పరిష్కారం

◗ **సమస్య:** మా పాడి గేదెల్లో రెండు తీవ్రమైన జ్వరంతో పాటు... శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కళ్లు ఎర్రబడటం వంటి లక్షణాలతో ఇబ్బంది పడుతున్నాయి. నివారణ ఎలా? - కె.మాల్యాద్రి, పామూరు

**సమాధానం:** వాతావరణ మార్పులు, కలుషిత నీరు, ఐబీఆర్ వైరస్ కారణంగా పశువుల్లో ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. వైద్యులను సంప్రదిస్తే తీవ్రతను బట్టి... జ్వరం వచ్చిన గేదెలకు రెండు పూటలా మెలోనెక్స్ ప్లస్ ఇంజెక్షన్లు, డెక్స్ సెలైన్ 20 శాతం ఎక్కించి... యాంటీ అలర్జిక్ మందులు వాడాలి.



డాక్టర్ రాచపూడి రమేష్

◗ **సమస్య:** మండలంలోని మాడి గొర్రెలు చనిపోతలతో ఈనుకు పోతున్నాయి. ఏం చేయాలి? - నారాయణరెడ్డి, సీఎస్‌పురం

**సమాధానం:** సాధారణంగా బ్రూసెల్లా జవిస్ అన్న సూక్ష్మ జీవి దీనికి కారణం. విత్తన పొట్టేళ్ల మార్పిడి ద్వారా సమస్యను అధిగమించవచ్చు. ఈసుకు పోయిన గొర్రె సీరమ్‌ను ల్యాబ్‌లో పరీక్షిస్తే వాస్తవ కారణమేంటన్నది తెలుస్తుంది.

- న్యూస్‌టుడే, కనిగిరి

# అందుబాటులో రాయితీ విత్తనాలు

న్యూస్‌టుడే - కంభం

రబీ సీజన్‌కు సంబంధించి రాయితీపై వివిధ రకాల విత్తనాలు అందజేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. జేజీ-11, కాక్-2 రకం శనగలు 38,352 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని... 25 శాతం రాయితీపై వీటిని ఇస్తున్నామని చెప్పారు. వరి రకాన్ని బట్టి 25, 30 కిలోల సంచులు; మినుము, పెసలు... నాలుగు కిలోల ప్యాకెట్ల రూపంలో అందజేస్తున్నామని వివరించారు. కావాల్సిన రైతులు వ్యవసాయ సహాయకుల వద్ద వివరాలు నమోదు చేసుకుని నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయిదెకరాల్లోపు రైతులకు మాత్రమే రాయితీ వర్తిస్తుందన్నారు.

మీ కోసం

**విత్తన రాయితీ వివరాలు (క్వింటాకు రూ.ల్లో)**

| విత్తనం | ధర | రాయితీ | రైతు చెల్లించాల్సినది |
|---|---|---|---|
| శనగ | | | |
| జేజీ-11 | 9,400 | 2,350 | 7050 |
| కాక్-2 | 12,100 | 3,025 | 9,075 |
| వరి | | | |
| బీపీటీ 5204 | 4180 | 500 | 3680 |
| 33892 రకం | 3780 | 500 | 3280 |
| మినుము | | | |
| వీబీఎన్-8 | 14 వేలు | 4,200 | 9,800 |
| పెసలు | | | |
| ఐపీఎం2-14, ఐపీఎం410-3 | 13 వేలు | 3,900 | 9,100 |

రైతేరాజు

ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్ తెలిపారు. ఆ పైర్లు, పండ్ల తోటలు సాగు చేసే వారికి వివిధ పథకాల ద్వారా పెద్ద మొత్తంలో రాయితీలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకునేందుకు సమీప ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. - న్యూస్‌టుడే, కంభం

# ఉద్యాన పంటల సాగుకు అండ



◗ కొత్తగా పండ్ల తోటలు సాగు చేసే వారికి నిర్దేశిత వ్యయంలో 40 శాతం రాయితీ లభిస్తుంది. జిల్లాలో 402 హెక్టార్లకు అనుమతి లభించింది. రెండు, మూడేళ్ల వయసున్న తోటల నిర్వహణ వ్యయానికి సంబంధించి వరుసగా 75, 90 శాతం రాయితీ ఇస్తున్నారు. ఇందుకు 613 హెక్టార్లకు ఆమోదం లభించింది.

◗ హైబ్రీడ్ కూరగాయల సాగు విస్తరణ పథకం కింద హెక్టారుకు రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం చేస్తారు. జిల్లాలో 137 హెక్టార్లలో సాగుకు ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకూ 18 హెక్టార్లకు సంబంధించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. పూల తోటల సాగుకు హెక్టారుకు రూ.16 వేలు చొప్పున తోడ్పాటు అందిస్తారు. జిల్లాలో 260 హెక్టార్లలో సాగుకు అనుమతి ఇవ్వగా ఇప్పటి వరకూ అరవై హెక్టార్లలో సాగయ్యింది. ఒక్కో రైతు గరిష్ఠంగా రెండు హెక్టార్లకు రాయితీ పొందవచ్చు.

◗ పండ్ల తోటల్లో ఫారం పాండ్స్ (నీటి కుంటలు) తవ్వకానికి రూ.75 వేలు చొప్పున రాయితీ ఇస్తున్నారు. జిల్లాలో 90 కుంటలకు ఆమోదం లభించగా... ఇప్పటి వరకూ యాభై కుంటల తవ్వకానికి అనుమతులు ఇచ్చారు.

◗ వంద మీటర్ల చొప్పున పొడవు, వెడల్పు; పది మీటర్ల లోతున పెద్ద నీటి కుంటల తవ్వకానికి రూ.20 లక్షల రాయితీ వర్తిస్తుంది. ఇప్పటి వరకు జిల్లాలో నాలుగింటికి ఆమోదం లభించింది.

◗ పంట ఉత్పత్తుల నిల్వకు సంబంధించి ప్యాక్ హౌస్‌లు, శీతల గిడ్డంగులు, రైపనింగ్ ఛాంబర్లు, కోల్డ్ రూమ్‌లు తదితరాలు మొత్తం 77 యూనిట్లకు ప్రణాళిక ఆమోదించారు. ఇప్పటి వరకూ 36 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు.

◗ షేడ్ నెట్, మల్చింగ్, తీగజాతి కూరగాయల సాగుకు పందిళ్ల ఏర్పాటు, వివిధ రకాల యంత్ర పరికరాలు... యాభై శాతం రాయితీపై అందిస్తున్నారు.

# త్వరలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలందిస్తాం

## ◗ పల్లె పండగలో మంత్రి స్వామి



సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి స్వామి, చిత్రంలో అధికారులు

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా 'పల్లె పండగ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం పెట్లూరులో సిమెంటు రోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువైన నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో 30 వేల పనులు గుర్తించి రూ.4500 కోట్లు మంజూరు చేసి పనులు చేస్తున్నామన్నారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండగను వారం రోజుల పాటు నిర్వహించి ఆయా పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌తో త్వరలో స్వయం సహాయక సంఘాలను సమన్వయం చేసుకొని రూ.50 వేల రాయితీ రుణాలు మంజూరు చేస్తామన్నారు. వైకాపా ప్రభుత్వ విధానం దోపిడీ అయితే..తాము నడిచే బాట ప్రగతి అని అన్నారు. దీపావళికి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డ్వామా పీడీ జోసఫ్ కుమార్, హౌసింగ్ అధికారి శ్రీనివాస ప్రసాద్, డీపీవో నాయుడు, గ్రామ సర్పంచ్ ఆరి తోటి ఝాన్సీరాణి, తహసీల్దార్ మురళి, ఎంపీడీవో రామాంజనేయులు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామయ్య చౌదరి, తెదేపా నాయకుడు ఆరి తోటి బాబురావు, రామారావు, పంచాయతీ రాజ్ అధికారులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై శిక్షణ

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి ప్రథమ చికిత్సపై ఔత్సాహికులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ ఛైర్మన్ పి.ప్రకాష్‌బాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ గుర్తింపు కలిగిన సెయింట్‌జాన్ అంబులెన్స్ (ఇండియా) సహకారంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో మూడు రోజులు తర్ఫీదునిస్తామన్నారు. 28, 29, 30 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు కొత్త కూరగాయల మార్కెట్ ఎదుట గల రెడ్‌క్రాస్ భవన్‌లో తరగతులు జరుగుతాయని, పాల్గొనేవారు పూర్తి వివరాలకు 99481 90081కు సంప్రదించాలన్నారు.

## ఇన్‌ఛార్జి డీఈవోగా సుబ్బారావు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లా విద్యా శాఖ అధికారి డి.సుభద్ర వ్యక్తిగత పనులపై వారం రోజులు సెలవు పెట్టడంతో ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించారు. ఆమె వచ్చే సోమవారం మళ్లీ విధుల్లో చేరనున్నారు.

## దొంగను పట్టుకున్న హోంగార్డుకు ప్రశంస



సీతారాం ప్రసాద్‌ను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ దామోదర్

ఒంగోలు నేరవిభాగం, కనిగిరి, న్యూస్‌టుడే: ఆలయంలో చోరీకి పాల్పడి పారిపోతున్న దొంగను వెంబడించి పట్టుకున్న హోంగార్డును జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అభినందించారు. కనిగిరి దొరువు బజారులోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం దొంగలు పడ్డారు. పామూరు బస్టాండ్ సెంటర్‌లో విధుల్లో ఉన్న హోంగార్డు సీతారాం ప్రసాద్ స్థానికుల ద్వారా చోరీ సమాచారాన్ని తెలుసుకుని, ఎస్సైకు తెలిపారు. నిందితుడు పోలయ్య కనిగిరి కొండ మీదుగా పారిపోతున్నట్లు తెలుసుకుని వెంబడించారు. హోంగార్డు కొండపైకి పరుగెత్తుకుంటూ వెళ్లి దొంగను పట్టుకుని స్టేషన్‌లో అప్పగించారు. చోరీకి గురైన కలశాలను స్వాధీనం చేసుకున్నారు. హోంగార్డు సీతారాం ప్రసాద్ తెగువను ఎస్పీ దామోదర్ కొనియాడారు. సోమవారం ఆయనకు ప్రశంసాపత్రం, రివార్డు ఇచ్చి సత్కరించారు.

## మహాప్రాకార నిర్మాణానికి రూ.లక్ష విరాళం



చెక్కును ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ చిన్న ఆదినారాయణకు ఇస్తున్న దాతలు

సియస్‌పురం, న్యూస్‌టుడే: మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన మహాప్రాకార నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు విరాళమందించారు. ఈ మేరకు బద్రి సాంబశివరావు, అరుణ దంపతులు, వారి కుమారుడు నారాయణ వెంకటసాయి రూ.1,00,001 నగదు చెక్కును సోమవారం ఆలయ ప్రాంగణంలో వ్యవస్థాపక ఛైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణకు అందజేశారు. నారాయణ స్వామికి ఆదివారం ఆదాయం రూ.3,25,056 లక్షలు వచ్చినట్లు ఈవో ఎస్. నరసింహబాబు తెలిపారు.

## నేడు ఐఎంఏ ఆధ్వర్యంలో దీక్షలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: గత తొమ్మిది రోజులుగా బెంగాల్‌లోని జూనియర్ వైద్యులు నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు మద్దతుగా ఐఎంఏ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు రాష్ట్రశాఖ ప్రధాన కార్యదర్శి ఫణిధర్ పేర్కొన్నారు. బెంగాల్‌లో దీక్షకు కూర్చున వారిలో ముగ్గురి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందన్నారు. వైద్య కళాశాల విద్యార్థులు, వైద్యులు దీక్షల్లో పాల్గొంటారన్నారు.

## దొంగతనం కేసులో నిందితుడికి జైలు

దొనకొండ, న్యూస్‌టుడే: దొంగతనం కేసులో నిందితుడు పొన్నూరి చిన్న సత్యానందంకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ దర్శి న్యాయస్థానం జడ్జి ఎస్.శివశంకరరెడ్డి సోమవారం తీర్పు ఇచ్చారు. కోర్టు కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల మేరకు 2019 జనవరి 5న నిందితుడు దొనకొండలోని అరబస్తాన్‌లో చిలంచర్ల వెంకట రామలక్ష్మి ఇంట్లోకి చొరబడి తుపాకి చూపించి నల్లపూసల దండ, బంగారు తాళిబొట్టు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకున్నారు. కేసు విచారణలో నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ మేరకు అడిషనల్ పీపీ ఆదినారాయణ వాదనలు విన్పించారు.

### బాలికపై అత్యాచారయత్నం ఘటనలో..

మద్దిపాడు : ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచార యత్నం చేసిన ఘటనపై కేసు నమోదైంది. బాధితుల వివరాల మేరకు సీతారామపురం కొష్టాలుకు చెందిన యడవల్లి హనుమంతరావు (35) మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలికపై శనివారం అత్యాచారానికి యత్నించాడు. ఆ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలపడంతో వారు మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, దీనిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సమాచారం.

# పునరావాస కేంద్రాల్లో వసతులు కల్పించాలి

టంగుటూరు, న్యూస్‌టుడే: పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి అవసరమైన అన్ని వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో టంగుటూరు మండలం ఆలకూరపాడులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రెవెన్యూ, సిబ్బందితో కలసి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ముసి వాగు ఒడ్డున ఉన్న గిరిజన కుటుంబాలకు చెందిన 35 మందిని స్థానిక జడ్పీ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో వసతి కల్పించారు. వారిలో 13 మంది చిన్నారులున్నట్లు తహసీల్దార్ ఆంజనేయులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాధితులతో నేరుగా మాట్లాడారు. వారికి అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి స్వయంగా వడ్డించారు. ఆశ్రయం పొందుతున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నిత్యం వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. శిబిరంలో ఉన్న వారికి భోజనం, తాగునీటి వసతులు కల్పించిన గ్రామ పెద్దలు ఆలం రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటేశ్వర్లును అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో దేవసేన కుమారి, డి.టి.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండ గ్రామీణం : తీర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో పూర్తి వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులకు సూచించారు. పాకలలోని ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, తహసీల్దార్ రవి, ఎంపీడీవో జయమణి, సిబ్బంది పాల్గొన్నారు.



పాకల పునరావాస కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

## అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తప్పనిసరి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ వైద్య సిబ్బందిని కోరారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి కార్యాచరణ గురించి వివరించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల డయేరియా, డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలకు ముందు జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. కాచి చల్లార్చిన నీరు లేదా క్లోరిన్ కలిపిన నీటిని మాత్రమే తాగాలన్నారు. ఈగలు వాలిన, చెడిపోయిన ఆహార పదార్థాలను, నిల్వ ఉన్నవాటిని తినకూడదన్నారు. మల విసర్జనకు వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్లనే వినియోగించాలన్నారు. వాంతులు, నీళ్ల విరేచనాలతో బాధపడేవారికి ఓఆర్ఎస్ తాగించాలన్నారు.

## వర్షాలతో క్వారీల్లో పనుల నిలిపివేత



నీట మునిగిన యంత్రాలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో చీమకుర్తి పరసర ప్రాంతాల్లో రెండు రోజులుగా జల్లులు పడుతూనే ఉన్నాయి. అయితే రామతీర్థం, మర్రిచెట్లపాలెం ప్రాంతాల్లో ఆదివారం రాత్రి కుండపోత వర్షం కురవడంతో దాదాపు ముప్పై క్వారీల్లోకి పెద్దఎత్తున నీరు చేరింది. దీంతో పనులు నిలిచిపోయి దాదాపు రెండువేల మంది కార్మికులు ఉపాధికి దూరమయ్యారు. మరో మూడు రోజుల వరకూ పనులు నిర్వహించే పరిస్థితి ఉండదని వారంటున్నారు. ఒంగోలు- కర్నూలు రహదారి పైకి వర్షం నీరు చేరి వాగును తలపించింది. పలుచోట్ల రాకపోకలకు అంతరాయం కలిగింది.



తటాకాన్ని తలపిస్తున్న గ్రానైట్ క్వారీ ప్రాంతం

# పట్టపగలే రూ.2 లక్షల ఆభరణాల చోరీ

మార్కాపురం, న్యూస్‌టుడే: స్థానిక భగత్‌సింగ్‌కాలనీలో పట్టపగలే రెండు లక్షల విలువైన ఆభరణాలు చోరీకి గురయ్యాయి. మార్కాపురం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక అరుణోదయ స్కూల్ ఎదురింట్లో నివాసముంటున్న కిన్నెర జయరాణి- జయ ప్రసాద్ భార్య భర్తలు. భర్త ప్రసాద్ గుంటూరులోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో మేనేజర్‌గా పని చేస్తూ అప్పుడప్పుడు ఇంటికొస్తుంటారు. ప్రసాద్ భార్య జయరాణి వారం కిందట తెనాలిలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లి అక్కడే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన బంధువులు జయరాణికి సమాచారం అందజేశారు. ఈ మేరకు ఆమె మార్కాపురం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోని బీరువా పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారని వాటి విలువ దాదాపు రూ.2 లక్షల వరకూ ఉంటుందని బాధిత మహిళ వాపోయారు. ఈ మేరకు పట్టణ ఎస్సై ఎం.సైదుబాబుతో పాటు సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

## కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

బసువుపల్లె (కొమరోలు గ్రామీణం), న్యూస్‌టుడే: వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలయ్యాయి. బసువుపల్లె గ్రామానికి చెందిన చిన్న పోలిరెడ్డి రైతు. ఇతని కుమారుడు ఎ.అఖిల్ కుమార్ రెడ్డి నాలుగో తరగతి చదువుతున్నాడు. సోమవారం బాలుడు ఇంటి వద్ద ఆడుకుంటుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో కన్ను, ముఖంపై గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. స్థానికుల సమాచారంతో కొమరోలు 108 సిబ్బంది వచ్చి గిద్దలూరు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



కన్నుపై గాయంతో అఖిల్ కుమార్ రెడ్డి

## ఉరి వేసుకొని ఆత్మహత్య

చీమకుర్తి, మద్దిపూడి న్యూస్‌టుడే: ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామతీర్థం సమీపంలోని సాగర్ కాలువ కట్ట పక్కనే ఉన్న చెట్టుకు తాడుతో ఉరి వేసుకొని వ్యక్తి మృతి చెందాడన్న సమాచారం మేరకు సీఐ ఎం.సుబ్బారావు సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వ్యక్తి వద్ద ఉన్న చరవాణి ఆధారంగా అతను మద్దిపూడి మండలం శివరాంపేటకు చెందిన రమణయ్య (48)గా గుర్తించారు. ఇతను నాలుగు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. ఇతని ఆచూకీ లేదని మద్దిపూడి పోలీసు స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైంది.

### విద్యార్థిని అదృశ్యంపై..

చీమకుర్తికి చెందిన తమ కుమార్తె అదృశ్యమైందని బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. చదువుకుంటున్న తమ కుమార్తె రెండు రోజులుగా కనిపించడంలేదన్న ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

**నెక్ సూచించిన కోడిగుడ్డు ధర**

**ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.ల్లో)**

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 135, రిటైల్ లైవ్ - 157, చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259

**గమనిక**

మార్కాపురం
•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

# పల్లెకు సీసీ రోడ్లతో మణిహారం

**● రూ.42.3 కోట్లతో పశ్చిమంలో పనులకు శ్రీకారం**

మార్కాపురం, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం రాకతో పల్లెకు పండగొచ్చింది. పల్లెలో అభివృద్ధి పనులకు సోమవారం నుంచి శ్రీకారం చుట్టుంది. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఉన్న 15 మండలాల్లో పల్లెల్లో మట్టి రోడ్డు అనేది లేకుండా ఉండేందుకు సీసీ రహదారులతో పాటు మురుగు కాలువలు, గోకులాలు నిర్మాణాలు చేపట్టాలని తలచింది. శంకుస్థాపనతో పనులు ప్రారంభించారు. గత వైకాపా ప్రభుత్వ హాయంలో గ్రామ పంచాయతీలను పట్టించుకోకపోవడంతో పాటు పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కనీసం ఒక్క రహదారి కాదు కదా కనీసం రహదారిపై ఏర్పడిన గుంతలను కూడా పూడ్చ లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వెంటనే జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద నిధులను అభివృద్ధికి భారీ స్థాయిలో ఖర్చు చేపట్టనుంది. గత నెలలో నిర్వహించిన గ్రామ సభల ద్వారా చేయాల్సిన పనులను గుర్తించారు. పశ్చిమంలో చేపట్టిన పనులకు గాను నియోజకవర్గంలో ప్రతి పల్లెకు సీసీ రహదారులు మంజూరు కావడంతో మణిహారంగా ఏర్పాటుగా మారనుంది.


ఇలాంటి మట్టి రహదారికి మోక్షం

**నియోజకవర్గాల వారీగా చేపట్టనున్న పనులు, మంజూరైన నిధులు**

| నియోజకవర్గం | సీసీ రోడ్ పనులు | నిధులు (రూ.కోట్లలో) | కాలువ పనులు | నిధులు (రూ.కోట్లలో) |
|---|---|---|---|---|
| మార్కాపురం | 75 | 12.40 | 7 | 2.60 |
| యర్రగొండపాలెం | 136 | 15.00 | - | - |
| గిద్దలూరు | 107 | 14.90 | - | - |

## వరద బాధితులకు విరాళం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె గ్రామంలోని మాజీ సైనికులు సోమవారం వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50వేల చెక్కును ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి అందజేశారు. అలాగే ఉప్పలపాడు గ్రామానికి చెందిన యర్రం కాశిరెడ్డి అన్న క్యాంటీన్ కోసం రూ.25వేలు విరాళం అందజేశారు.


రూ.50వేల చెక్కును ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి అందజేస్తున్న మాజీ సైనికులు

# వాయుగుండం.. రైతన్నకు గండం

**● భారీ వర్ష సూచనతో ఆందోళన**

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం మండలంలో ముసురు పట్టింది. దీంతో ఎడతెరిపి లేకుండా జల్లులు పడుతుండటంతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పొలాలన్నీ జలమయమయ్యాయి. నాలుగు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ఖరీఫ్ సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

**పంటలు కోల్పోయే ప్రమాదం..**

బోరు బావులతో పాటు సాగర్ కాలువలకు నీరు విడుదల కావడంతో మండలంలోని దాదాపు 7 వేల ఎకరాల్లో మిరప సాగు చేశారు. పైరు పూత, పిందె దశల్లో ఉంది. ఆదివారం కురిసిన భారీ వర్షంతో జి.ఉమ్మడివరం, వెంగాయపాలెం, గుట్లపల్లి, డీవీఎన్ కాలనీ, ముడివేము, మేడపి, అన్నసముద్రం ప్రాంతాల్లో సాగులోని మిరప పంట పొలాల్లో అడుగు మేర నీరు నిలిచింది. దీనికి తోడు వాయుగుండం ప్రభావంతో సోమవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో నీరు ఇంకా అధిక మొత్తంలో చేరడంతో ఉరకెత్తి పంటను కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని మిరప రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వరికి దెబ్బ..**

సాగర్ ఆయకట్టు ప్రాంతాల్లో ఆరేడు గ్రామాల్లో 12వేల ఎకరాల్లో వరి పనులు పూర్తయ్యాయి. గొల్లపల్లి, వెల్లంపల్లి, విశ్వనాథపురం గ్రామాల్లో ముందస్తుగా నాట్లు వేయడంతో ప్రస్తుతం వరి పైరు పొట్ట దశలో ఉంది. ఈ తరుణంలో వర్షం కురవడంతో వరి పొట్టలోకి వాన నీరు చేరడం వల్ల తక్కువ మోతాదులో సుంకుపోసుకుని తాలు కంకులుగా మారే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి వర్షం కురిస్తే లేత వరిని ఆకు చుట్టూ పురుగు ఆశించే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. సజ్జ, కొర్ర, మొక్కజొన్న సాగు కండెవలిచే దశలో ఉంది కంకిలోకి వర్షం నీరు చేరి దెబ్బతింటుందని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు పంట చివరి దశలో ఉంది. పొలాల్లో నీరు నిలవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.


మేడపిలో మిర్చి పొలంలో నిలిచిన వాన నీరు

**అప్రమత్తంగా ఉండాలి**

నాలుగు రోజుల పాటు వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు అందించాలని ఆదేశించాం. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తెలియజేశాం.
– కె.నీరజ, వ్యవసాయాధికారి, త్రిపురాంతకం

బేస్తవారపేట, న్యూస్‌టుడే: కోత దశలో ఉన్న సజ్జ పంట దెబ్బతినకుండా పంటలో జడలు కట్టడం ద్వారా నష్టాన్ని నివారించుకోవచ్చునని గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీ నాయక్ పేర్కొన్నారు. సోమవారం బేస్తవారపేట మండలంలోని గలిజేరుగుళ్ల, కోనపల్లి తదితర గ్రామాల్లోని సాగులో ఉన్న సజ్జ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.


గలిజేరుగుళ్లలో సజ్జ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీ నాయక్, ఏవో మెర్సీ.

# గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

గిద్దలూరు పట్టణం, పెద్దదోర్నాల, కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా తెదేపా ప్రభుత్వం ముందుకు వెళుతోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె, కంచిపల్లె గ్రామాల్లో పల్లె పండుగ ప్రగతికి అండగా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో రూ.70లక్షల రహదారి నిర్మాణం పనులకు భూమిపూజ చేపట్టారు.


గిద్దలూరు : సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి


పెద్దదోర్నాలలో సిమెంటు రహదారి నిర్మాణ పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు

కృష్ణంశెట్టిపల్లె గ్రామ సర్పంచి ఎలిజబెత్ రాణి ఎమ్మెల్యే సమక్షంలో తెదేపాలో చేరారు. ◗ దోర్నాల మండలంలోని పెద్దదోర్నాలలో సోమవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ బాధ్యుడు గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొని సిమెంటు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోర్నాల మండలంలో పది పంచాయతీల్లో రూ.2.25 కోట్లతో 3.38 కి.మీల సిమెంటు రహదారుల నిర్మాణాలు ప్రారంభిస్తున్నామన్నారు. సంక్రాంతి నాటికి పనులు పూర్తవుతాయన్నారు.

## సమన్వయంతో విజయవంతం చేయండి

కొమరోలు గ్రామీణం: మండలంలో ఈ నెల 16 నుంచి నిర్వహించే పల్లె పండుగ-ప్రగతికి అండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో షేక్.మస్తాన్ వలీ తెలిపారు. కొమరోలు మండల పరిషత్తు సమావేశ మందిరంలో ఉపాధి, ఇంజినీరింగ్ సహాయకులకు కార్యక్రమంపై అవగాహన సదస్సును నిర్వహించారు. అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మస్తాన్ వలీ

ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ ఈరయ్య, ఏపీవో ఆర్.మహాలక్ష్మీ, ఈవోపీఆర్డీ బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి అధికారులు పాల్గొన్నారు.

## రహదారులు బురదమయం


కొమరోలు : చిత్తడిగా మారిన పురుషోత్తమునిపల్లె రోడ్డు

పొదిలి, కొమరోలు గ్రామీణం : తుపాను ప్రభావంతో పొదిలిలో సోమవారం ఎడతెరపి లేని వర్షం పడింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు జల్లులు పడుతూనే ఉండటంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోయారు. కొత్తూరులో సబ్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి, ఆంజనేయస్వామి దేవాలయం వద్ద వర్షపునీరు భారీగా నిలిచింది. దీంతో వాహనచోదకులు, పాదాచారులు ఇబ్బంది పడ్డారు. మూడురోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షం పడుతుందన్న వాతావరణశాఖ సూచనలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోజువారి కూలీలు పనులు మానుకొని ఇళ్లకే పరిమితమయ్యారు. కొమరోలు నుంచి పురుషోత్తమునిపల్లెకు వెళ్లే రహదారి కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారిపోతోంది. వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ మట్టి రహదారిని సీసీ రహదారిగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పీఆర్ ఏఈ ఈరయ్య మాట్లాడుతూ రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు.


పొదిలి : ఆంజనేయస్వామి దేవాలయం ఎదుట ఇలా..

## గుంతల రహదారిలో అవస్థల ప్రయాణం

బేస్తవారపేట, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాలను అనుసంధానం చేసే పల్లెదారులు అధ్వానంగా తయారయ్యాయి. సలకలవీడుకు వెళ్లే రహదారి పలు చోట్ల దెబ్బతిని గుంతలమయంగా మారింది. శంకర్‌రెడ్డి ఫార్మసీ కళాశాల నుంచి గ్రామంలోకి సుమారు కిలోమీటర్ పైనే ఉండే ఈ దారిలో రాకపోకలు సాగించేందుకు నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్థులు, వాహనచోదకులు వాపోతున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్యను ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తే మరింత ఇబ్బందిగా ఉందని, రహదారికి మరమ్మతులు చేపట్టాలనిగ్రామస్థులు, వాహనచోదకులు కోరుతున్నారు.


అధ్వానంగా మారిన సలకలవీడుకు వెళ్లే రోడ్డు

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008632343
పొదిలి : 8008550360

కంభం (రాచర్ల), న్యూస్‌టుడే :

సమస్య : రాచర్ల మండలం చోళవీడు నుంచి చిన్నగానిపల్లె వెళ్లే రహదారి గుంతలు పడింది. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పూడ్చించేందుకు చర్యలు తీసుకోవాలి. – వెంకటేశ్వర్లు, స్థానికుడు

సమాధానం : రహదారిపై ఏర్పడిన గుంతలను పరిశీలించి, వాటిని పూడ్చించేందుకు చర్యలు తీసుకుంటాం. – రంగస్వామిరెడ్డి, పంచాయతీరాజ్ జేఈ, రాచర్ల



## నేడు మండల సర్వసభ్య సమావేశం

కంభం (రాచర్ల): రాచర్ల మండల సర్వసభ్య సమావేశ మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 గంటలకు పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా రాచర్ల గ్రామ పంచాయతీలోని పలు రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి తప్పక హాజరుకావాలని కోరారు.

## ఆదమరిస్తే అపాయమే

పొదిలి, న్యూస్‌టుడే : పొదిలి లోని మార్కాపురం అడ్డ రోడ్డు సమీపంలో ప్రధాన రహదారిపై గుంత పడింది. వర్షాలకు తరచూ నీరు నిలబడి తారు రోడ్డు దెబ్బతిని కంకర లేచిపోయింది. ప్రస్తుతం పడుతున్న వర్షాలకు గుంతల్లో నీరు నిండి గుంత కనిపించకపోవడంతో ద్విచక్రవాహన చోదకులు ఏమాత్రం ఆదమరిచిన బండి బోల్తా పడే ప్రమాదం ఉంది. దీంతో స్థానికులు అటుగా వాహనాలు వెళ్లకుండా బారీ కేడ్‌ను అడ్డుగా పెట్టారు. పట్టణంలో పాత పోస్టాఫీసు వీధి ముందు, చిన్న బస్టాండ్ ప్రాంతాల్లోను ఇలాంటి గుంతలు దర్శనమిస్తున్నాయి. రహదారిపై పడిన గుంతలు మరమ్మతులు చేయించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు.


గుంతలో వాహనాలు పడకుండా బారికేడ్ పెట్టిన దృశ్యం

## డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించండి

యర్రగొండపాలెం పట్టణం, పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: యర్రగొండపాలెం మండలం కొలుకుల గ్రామానికి ఈ నెల 17న వస్తున్న వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను తెదేపా, భాజపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం అమరావతి వెళ్లిన నాయకులు సచివాలయంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వై.పాలెం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వై.పాలెం ప్రభుత్వ వైద్యశాలలోని డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించాలని తెదేపా ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు కోరినట్లు తెలిపారు. ◗ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బట్టు సుధాకర్‌రెడ్డి, తెదేపా యర్రగొండపాలెం నియోజకవర్గ బాధ్యుడు ఎరిక్షన్‌బాబు సోమవారం సచివాలయంలో కలిశారు. మండలంలోని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఆయనను కోరారు.


వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసిన తెదేపా భాజపా నాయకులు

## బాధ్యతల స్వీకరణ

కంభం (రాచర్ల), న్యూస్‌టుడే : రాచర్ల మండల నూతన తహసీల్దార్‌గా లోకసాని వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో అర్ధవీడు మండల డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను కార్యాలయ అధికారులు, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.


విధుల్లో చేరిన తహసీల్దార్ వెంకటేశ్వర్లు

## పారిశుద్ధ్య పనులు చేపట్టండి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం మండలంలో అధికారులు రాజకీయ పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ బండి లక్ష్మీదేవి కోరారు. స్థానిక మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను చదివి నిపించారు. ఆయా శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ప్రజా ప్రతినిధులను కోరారు. అనంతరం ఇన్‌ఛార్జి ఎంపీడీవో వై.భాగ్యవతి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా పలు మండల పరిషత్తు ఆధ్వర్యంలో జరిగే పనులకు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు నారు బాపనరెడ్డి, మార్కాపురం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లక్ష్మీనారాయణ, అధికారులు రాందాసునాయక్, విజయ మోహన్‌రాజా, రమేష్‌బాబు, పిచ్చియ్య, బి.జీవరత్నం, నాగేంద్రారెడ్డి, డాక్టర్ లీనాగ్రేస్, నాగరాజు, అరుణ, లలితసలోమి, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బండి లక్ష్మీదేవి

## 16 నుంచి కొత్త మద్యం విధానం

మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, పొదిలి, కంభం, : జిల్లాలోని ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణకు సోమవారం ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో లాటరీ నిర్వహించారు. పొదిలి పరిధిలోని 16 దుకాణాలకు 297 దరఖాస్తులు రాగా ఈ 80 దుకాణాలకు సంబంధించిన లాటరీని కౌంటర్ నంబరు 1లో కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో లాటరీ తీసి దుకాణాలను కేటాయించినట్లు పొదిలి సీఐ టి.అరుణకుమారి తెలిపారు. గిద్దలూరు పరిధిలోని 13 దుకాణాలకు 232, మార్కాపురంలోని 13 దుకాణాలకు 327, కంభంలోని 10దుకాణాలకు 240, యర్రగొండపాలెం పరిధిలోని 13 దుకాణాలకు 255 దరఖాస్తులు రాగా, వీటిని కౌంటర్ నెంబరు2లో జేసీ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించారు. లాటరీలో షాపులు దక్కించుకున్న వారు ఈనెల 16వ తేదీ నుంచి ప్రభుత్వ నిబంధనల మేరకు ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నారు.

## భక్తిశ్రద్ధలతో గంధమహోత్సవం

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి నవాబుమిట్టలో సోమవారం మహబుబ్ సుభాని గంధమహోత్సవాన్ని ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వర్షం లోనే గంధాన్ని దర్గాకు తీసుకొచ్చారు. భక్తులు దర్గాను సందర్శించి స్వామివారి గంధాన్ని, ప్రసాదాన్ని స్వీకరించారు. వర్షం కారణంగా అన్నదాన కార్యక్రమాన్ని వాయిదా వేశారు.

## వేలంపాటలో అమ్మవారి కలశం కైవసం

బేస్తవారపేట, న్యూస్‌టుడే: దసరా నవరాత్రుల్లో భాగంగా బేస్తవారపేటలోని స్థానిక శ్రీ వాసవీకన్యకా పరపరమేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో నిత్యం రుత్వికుల ద్వారా అమ్మవారి ఆవాహనం పూజలు అందుకున్న కలశాన్ని సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు అనపర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బేస్తవారపేటకు చెందిన మట్టా శివకుమార్ దంపతులు కలశాన్ని రూ.75 వేలకు దక్కించుకున్నారు.

## పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి

పొదిలి, న్యూస్‌టుడే: పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం రజక విద్యాసేవా సంక్షేమ సంఘం పనిచేస్తుందని ఆసంఘం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షుడు డి.శంకర్ చెప్పారు. నిరుపేద కుటుంబాలు అభివృద్ధి చెందాలంటే కేవలం విద్య వల్లనే అది సాధ్యమవుతుందని గమనించి రజక వృత్తిదారుల వారి కుటుంబాలకు చెందిన పేద విద్యార్థుల చదువులకు ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభ గల పదో తరగతి విద్యార్థులకు ప్రతి ఏడాది చేయూతనిస్తున్నట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోను ఈ సేవలను విస్తరించనున్నట్లు చెప్పారు. వివిధహోదాల్లో ఉన్న ఉద్యోగులు రజక విద్యా సేవా సంక్షేమ సంఘం చేపట్టబోయే కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించాలని ఆయనకోరారు.

# సమాజ హితం.. సేవే అభిమతం

**● ఆపన్నులకు అండగా యువకేర్ సైనికులు**

**పది మందికి సాయం చేయడంలోనే అసలైన సంతృప్తి ఉందని నిరూపిస్తున్నారు ఆ యువకులు అన్నార్తుల ఆకలి తీర్చడంతో పాటు, రక్తదానం, నిరుపేద విద్యార్థులకు ఆర్థికసాయం, అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం వంటివి చేస్తూ పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. వారే యువకేర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు** - మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే

మార్కాపురం పట్టణానికి చెందిన ఎస్‌కె.మహమ్మద్ ఆరీఫ్ ఉద్దీన్ ఎంటెక్ చదివివారు. ఒక సేవా సైన్యాన్ని తయారు చేశారు.. విష్ణు, మునాఫ్, కరిముల్లా, నిజాముద్దీన్, జైనులాబ్దీన్ వంటి సంస్థ సభ్యుల సహకారంతో టెక్నాలజీ, సోషల్ మీడియాను ఉపయోగించుకొని తన సేవా కార్యక్రమాలను ముందుకు సాగిస్తున్నారు. ఇతను ఒంగోలులో ఇంజినీరింగ్ చదివేటప్పుడే స్నేహితులతో కలసి బదిరుల పాఠశాలలకు వెళ్లి అల్పాహారం, చాక్లెట్లు పంచడం వంటి కార్యక్రమాలు చేస్తుండేవారు. తరువాత ఎంటెక్ గుంటూరులో చదువుతున్నపుడు స్నేహితుల పుట్టిన రోజు సందర్భంగా వారితో కలసి ఆరీఫ్‌ఉద్దీన్ రైల్వేస్టేషన్, బస్టాండ్, రోడ్లవెంట ఉండే యాచకులకు ఆహారం, బట్టలు పంపిణీ చేసే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 2017వ సంవత్సరంలో యువకేర్ వెల్ఫేర్ సంస్థను స్థాపించారు ఒక్కనితో మొదలైన ఈ సంస్థలో ప్రస్తుతం 3 వేల మందికి పైగా సభ్యులతో తెలుగు రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకుసాగుతోంది. ఆరీఫ్ ఉద్దీన్ ప్రస్తుతం గన్నవరంలోని ఓ ప్రైవేటు కంపెనీలో సీనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు.


నిరుపేదలకు ఆహారాన్ని అందజేస్తున్న యువకేర్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

**చేపట్టిన కార్యక్రమాలు ఇవే...**

పేద విద్యార్థులకు చదువుకు, యువతకు ఆర్థిక సాయం చేయడం, రక్తదానం చేయడం, నిరుపేదలకు నిత్యవసర సరకులు పంపిణీ. నిరుపేద యువత వివాహాలకు ఆర్థిక సాయం అందించడం. నిరుపేదలకు వైద్య చికిత్సలు అందించడం, వివాహాలకు ఆర్థిక సాయం అందించడం.

**ఆనందంగా ఉంది...**

నా సొంత పనులు చేసుకుంటూ ఖాళీ సమయాల్లో సొసైటీ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో ఆనందానిస్తోంది. – షేక్ కరీముల్లా, ఎలక్ట్రీషియన్, మార్కాపురం



**ఎంతో సంతృప్తినిస్తోంది**

సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో సంతృప్తినిస్తోంది. స్నేహితులు మొదలుపెట్టిన ఈ సొసైటీఇప్పటి వరకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, గుంటూరు, విజయవాడ, నంద్యాల, కర్నూలు తదితర ప్రాంతాల్లో 3 వేల మందికి రక్తదానం చేశాం. మా సేవలకు గుర్తింపుగా పలు రాష్ట్ర, జాతీయ అవార్డులు లభించాయి మా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళతాం. – ఎస్‌కె.ఆరీఫ్ ఉద్దీన్



## మెరుగైన వైద్యసేవలు అందించండి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు వైద్యవిధాన పరిషత్ వైద్యశాలలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషిచేద్దామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వైద్యాధికారులకు సూచించారు. ఆయన సోమవారం సాయంత్రం గిద్దలూరు వైద్యవిధాన పరిషత్ వైద్యశాలను తనిఖీ చేశారు. వైద్యశాల ఆవరణను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో పారిశుద్ధ్య మెరుగు చర్యలు తీసుకోవడంతో పాటు వైద్యశాల ప్రాంగణంలో అంతర్గత రహదారుల మెరుగు చర్యలు తీసుకుందామని తెలియజేశారు.. ఆసుపత్రి ఆవరణలో 60 పడకల గదులను గుత్తేదారుడు నిర్మాణం చేపట్టకుండా వదిలివేయడంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, ఆయా గదుల నిర్మాణం చేపట్టేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. సమీకృత ల్యాబ్‌లో గదులు కారుతుండంపై వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యశాల పర్యవేక్షకుడు డా.ఆదాం, వైద్యాధికారులు రమణారెడ్డి, సుధాకర్, జయమ్మ, ఖాదరయ్య, ప్రవీణ్, శశి తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రి ఆవరణను పరిశీలించి సిబ్బందికి సూచనలు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

**మేమున్నాం.. మీకు తోడుగా..** కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

మర్రిపూడి, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని జువ్విగుంట బీసీ కాలనీలో వీధిదీపాలు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో రాత్రి పూట ఇబ్బందిగా ఉంటుంది. – బసవయ్య, స్థానికుడు

సమాధానం: సమస్య ఇప్పుడే మా దృష్టికి వచ్చింది. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వీధిదీపాలు మరమ్మతులు చేయిస్తాం. సమస్య పరిష్కరిస్తాం. – సాంబశివరావు, ఈవోఆర్డీ

# కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

## బాధ్యతల స్వీకరణ

పీసీపల్లి, న్యూస్‌టుడే: పీసీపల్లి మండల ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఒగ్గుగంటి ప్రభాకరశర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పెద్దారవీడు ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఈ ప్రాంతానికి వచ్చారు. ఇక్కడ ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయ ఏవోగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు.

## పోలీస్ స్టేషన్ తనిఖీ

తాళ్లూరు, న్యూస్‌టుడే : తాళ్లూరు పోలీస్‌స్టేషన్‌ను సోమవారం రాత్రి దర్శి సీఐ వై.రామారావు తనిఖీ చేశారు. వివిధ రకాల దస్త్రాలను పరిశీలించారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్సై మల్లికార్జునరావు, ఇతర సిబ్బందికి వివరించారు. కేసుల పరిష్కారంలో పురోగతి సాధించాలన్నారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధికే ‘పల్లె పండగ’



కనిగిరి: పునుగోడు ఎస్టీ కాలనీలో రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, అధికారులు



కురిచేడు: సీసీ రహదారి శంకుస్థాపనలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ లలిత్‌సాగర్ దంపతులు

కనిగిరి, కురిచేడు, ముండ్లమూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసమే పల్లె పండగ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పునుగోడు గిరిజన కాలనీలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు, మండలంలోని యడవల్లి రిపల్లెలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కల్వర్టుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఎంపీడీవో హనుమంతరావు పాల్గొన్నారు. ● రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో కురిచేడు మండలాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మీ పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సోమవారం కురిచేడు, పడమర వీరాయపాలెం, ఆవుల మంద గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ దర్శి శాసన సభ్యులు నారపుశెట్టి పాపారావు, కడియాల లలిత్ సాగర్ తదితరులు పాల్గొన్నారు. ● ముండ్లమూరు మండలంలోని పోలవరం గ్రామంలో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి మండల అధికారులు ఎంపీడీవో రావూరి జనార్దన్ శంకుస్థాపన చేశారు. ● దర్శి మండలం తూర్పువెంకటాపురంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీడీవో కృష్ణమూర్తి శంకుస్థాపన చేశారు. అలాగే మురుగు కాలువల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.

## అడుగుకో గుంత.. వాహనదారులకు చింత

▶ అధ్వానంగా కనిగిరి మున్సిపాలిటీలోని రోడ్లు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కంభం రోడ్డు. కనిగిరి నుంచి కంభం, హనుమంతునిపాడు మండలాలకు నిత్యం వందలాది ద్విచక్రవాహనాలు, ఆటోలతో పాటు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. మున్సిపాలిటీ పరిధిలో మూడు కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డులో వందకు పైగా గుంతలు ఉన్నాయి. రాత్రి పూట అయితే అవి కనిపించక ప్రజలు గాయాలపాలవుతున్నారు. నాలుగు రోజుల కిందట మధు బాబు అనే యువకుడు రోడ్డుపై వస్తూ గుంతల్లో పడి గాయపడి ఆసుపత్రి పాలయ్యారు.



కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో శంకవరం రోడ్డు దుస్థితి ఇది. గతంలో రోడ్డుపై గుంతల్లో నడవలేక న్నామని స్థానిక మహిళలు ముళ్ల కంచెను రోడ్డుకు అడ్డం పెట్టి ఆందోళన చేశారు. ఈ సమయంలో అప్పటి వైకాపా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ స్వయంగా స్థానికులతో మాట్లాడి రోడ్డు వేయిస్తానని చెప్పి హామీ ఇచ్చారు. ఆయన పదవి కాలం పూర్తయినా రోడ్డు మాత్రం పడలేదు. చేసేదేమీలేక శిథిలావస్థకు చేరిన రోడ్డుపై ప్రయాణిస్తూ నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

| మున్సిపాలిటీ | విస్తీర్ణం(చ.కి.మీ) | మొత్తం రహదారులు (కి.మీ) | సీసీరోడ్లు | కచ్చారోడ్లు | తారు రోడ్లు |
|---|---|---|---|---|---|
| కనిగిరి | 49.30 | 138.66 | 109.33 | 29.33 | 30 కిలో మీటర్లు.. సుమారు |

కనిగిరి, న్యూస్‌టుడే:

కనిగిరి పురపాలిక పరిధిలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చాలా ప్రాంతాల్లో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. రహదారులపై ఏర్పడిన గుంతలపై నీరు చేరి ప్రయాణికులకు దారి కనిపించడం లేదు. తారు రోడ్డు మొదలు సీసీ రోడ్ల వరకు అన్ని గుంతలు.. మిట్టలు.. ఎగుడు, దిగుడుగా తయారై రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### వెంచర్లకు రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు..

గత వైకాపా అయిదేళ్ల పాలనలో రోడ్ల మరమ్మతులు, నూతన రోడ్ల నిర్మాణాలకు రూ. 2కోట్లకు పైగా నిధులు వెచ్చించారు. కానీ నిధులన్నీ కరిగిపోయాయే తప్ప రోడ్లు బాగుపడిన దాఖలాలు లేవు. ఎవరి అవసరం వారికి అన్నట్లుగా ఆ పార్టీ నాయకులు వారి ఇళ్లు, వారు వేసే వెంచర్ల వద్దకు సీసీరోడ్లు వేసుకున్నారే తప్ప ప్రజలు నడిచే చోట మాత్రం రోడ్లు వేయక పోవడం గమనార్హం. దీంతో శిథిల రోడ్లపై రాకపోకలు సాగించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా ఇలాంటి పరిస్థితి పట్టణంలోని రామాలయం వీధి, బొడ్డు చావిడి సెంటర్, పామూరు బస్టాండ్, కరణం వీధి, సుభాష్‌రోడ్డు, కొత్తపేట, నక్కల తిప్ప, ఇందిరాకాలనీ, ఎన్జీవో కాలనీ, శివనగర్ కాలనీల్లో సీసీరోడ్లలో నెలకొంది. అలాగే కనిగిరి కంభం రోడ్డు, కనిగిరి శంకవరం రోడ్డు, వ్యవసాయ మార్కెట్ రహదారులు ఛిద్రమయ్యాయి. ప్రస్తుతం కురుస్తున్న వానలకు రహదారిపై మోకాలి లోతు నీరు చేరింది. ఇప్పటికైనా మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చించి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ డానియేల్ జోసెఫ్‌ను వివరణ కోరగా.. ఆయా శాఖల అధికారులతో మాట్లాడి గుంతలు పూడ్చించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ముండ్లమూరు: చిలకలేరువాగు ప్రవాహన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, పీసీపల్లి, న్యూస్‌టుడే: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు ఎల్. లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కలెక్టరు ఆదేశాలతో మండలంలోని వాగులను సోమవారం తహసీల్దారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండవద్దని, వాగు ప్రవాహల్లో ఎవరు దిగవద్దని సూచించారు. ● రానున్న మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీసీపల్లి మండల తహసీల్దార్ సీహెచ్. ఉష సోమవారం సూచించారు.

## రైతులకు అందుబాటులో ఉండాలి




మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

దర్శి, న్యూస్‌టుడే: అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వ్యవసాయానికి సంబంధించిన సాంకేతిక సమాచారాన్ని అందించి మంచి దిగుబడులు సాధించేలా కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కేవీకేలో దర్శి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది, విస్తరణాధికారులు, ఏవోలకు పంటల సాగు, యాజమాన్య పద్ధతులు, జాతీయ పెస్ట్ సర్వేలెన్స్ విధానంపై సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ పంట నమోదు, సోషల్ ఆడిట్, పొలం పిలుస్తోంది వంటి కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా కృషి చేయాలన్నారు. కేవీకే సమన్వయకర్త డా. రమేష్, వ్యవసాయ పరిశోధాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సంధ్యారాణి, జిల్లా శిక్షణ సమన్వయకర్త రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ముసీ వాగుపై వంతెన నిర్మాణానికి డిమాండ్

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ముప్పవరం నుంచి లక్ష్మీపురం గ్రామం వెళ్లే దారిలో ముసీ వాగుపై వంతెన నిర్మాణం చేయాలని సీపీఎం నేత గడ్డం పిచ్చయ్య డిమాండ్ చేశారు. సోమవారం మిట్టపాలెం గ్రామంలో మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టంగుటూరు మండలంలోని లక్ష్మీపురం, పొందూరుతో పాటు కొన్ని గ్రామాలు ప్రజలు కొండపికి రావాలన్న, కొండపి ప్రజలు అటువైపు పోవాలన్న చుట్టూ తిరిగివెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ఈ మార్గంలో వంతెన నిర్మిస్తే ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

## కనిగిరి వైద్యశాలకు విరాళం



ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి నగదు అందజేస్తున్న దాత గురవయ్య, నాయకులు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: కనిగిరి సామాజిక వైద్యశాల అభివృద్ధికి దాతలు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని నారాయపల్లికి చెందిన వ్యాపారవేత్త బుర్రి గురవయ్య సోమవారం తన వంతు సాయంగా రూ.1 లక్ష నగదును ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి కనిగిరిలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఎమ్మెల్యే ఉగ్ర అభినందించారు. తెదేపా మండల నాయకులు గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, దేవిరెడ్డి రాజారెడ్డి పాల్గొన్నారు.

## దుస్తుల పంపిణీ




వేములపాడులో పాఠశాల ప్రతినిధులకు దుస్తులు అందజేస్తున్న దాత నారాయణ

వేములపాడు(హనుమంతునిపాడు), న్యూస్‌టుడే: మండలంలోని వేములపాడు గ్రామానికి చెందిన దాతలు చెక్కానారాయణ, లక్ష్మీదేవి దంపతులు కనిగిరి, చీమకుర్తిలో ఉన్న ఎస్కేఆర్. మానసిక దివ్యాంగుల పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం రూ.60 వేల విలువచేసే దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రతినిధులు ఎస్. అంజిరెడ్డి, వి. మదన్‌మోహన్‌రెడ్డిలు దాతల సేవలు అభినందనీయమన్నారు.



టంగుటూరు: మునిగిన పంట పొలాలు



టంగుటూరు: రైల్వే అండర్‌పాస్ వద్ద తటకాన్ని తలపిస్తూ..

## వాగుల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని విఠలాపురం, రజానగరం దోర్నపువాగులతోపాటు దోసకాయలపాడువద్ద ఉన్న వాగుల్లో వరద నీరు ఉద్ధృతమై ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున అధికారులు అప్రమత్తమయ్యారు. రెవెన్యూ, పోలీసు శాఖలకు చెందిన పలువురు అధికారులు, వీఆర్వో, వీఆర్ఏలు, పోలీసు సిబ్బందిని కలిపి ఉమ్మడిగా మూడు బృందాలుగా ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని తహసీల్దారు తెలిపారు. వరదనీరు పెరిగితే ఆ వైపు ప్రయాణీకులు రాకపోకలు సాగించేందుకు వీల్లేకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

## ఎడతెరిపి లేని వర్షం.. రోడ్లన్నీ జలమయం..

న్యూస్‌టుడే బృందం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో దర్శి, కనిగిరి, కొండపి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. టంగుటూరు, జరుగుమల్లి మండలాల్లో కురిసిన జోరువానకు ప్రధాన రోడ్లతో పాటు గ్రామీణ రహదారులు నీట మునిగాయి. మురుగు కాలువలు నీరు పారేలా ఉండక పోవడంతో పొంగి రోడ్లపైకి ప్రవహించాయి. టంగుటూరు - కొండపి రోడ్డులోని జాతీయ రహదారి అండర్ పాస్ వద్ద వర్షపు నీరు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. టంగుటూరు తహసీల్దార్ సముద్ర తీరం వెంబడి గ్రామాలైన ఆలకూరపాడు, అనంతవరం ఇతర ప్రాంతాల్లో పర్యటించారు. ఆలకూరపాడు గ్రామంలో పునరావాస కేంద్రాలకు ముసి వాగు ఒడ్డున ఉన్న గిరిజన కుటుంబాలను తరలించారు. కనిగిరి పట్టణంలో వీధులన్నీ జలమయ్యాయి. కనిగిరి పెద్ద చెరువు అలుగు వాగు ఆక్రమించడంతో నీరు గృహాల్లోకి చేరింది. తాళ్లూరు మండలంలోని గ్రామాల్లోని రహదారులన్నీ చెరువులను తలపించాయి. ప్రజలకు బయటకు వచ్చేందుకు వీలు లేకపోవడంతో ప్రధాన వీధులు, మండల కార్యాలయాల ప్రాంతాలు వెలవెలబోయాయి. వరికోతలు కోసేందుకు వీల్లేక కొందరు రైతులు ఇబ్బందులకు గురయ్యారు. మరికొన్ని చోట్ల పంట ఎండుముఖం పట్టే సమయంలో వర్షాలు పడటంపై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కనిగిరి: మాచవరం వద్ద కందిచేనులోకి చేరిన వర్షపు నీరు



కనిగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఇలా..

## మేజిస్ట్రేట్‌కు ఉద్యోగ విరమణ సత్కారం

దర్శి, న్యూస్‌టుడే: దర్శి ప్రత్యేక రెండో తరగతి మెజిస్ట్రేట్ బొటుకు గంగాధర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న సీనియర్ సివిల్ న్యాయమూర్తి శివశంకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. సమయపాలన, అంకితభావం, నిబద్ధతతో గంగాధర్ పని చేశారని కొనియాడారు. అనంతరం న్యాయవాదులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, పట్టాభిరామిరెడ్డి, రమణారెడ్డి, ఇతర న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎట్టకేలకు ఎలికావారిపల్లి రహదారికి మోక్షం

ఈనాడు కథనానికి స్పందన

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ ఎలికావారిపల్లి రహదారి నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. గత నెల 8న ఈనాడులో ‘ఐదేళ్లు.. పట్టించుకునేవారేరి’ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు రూ.35 లక్షల ఉపాధి నిధులతో పనులు చేసేలా మంజూరు చేశారు. ఆ పనులు మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో ఎం. రంగసుబ్బారాయుడు సోమవారం తెలిపారు.

## రూ.10 నాణెంపై వినియోగదారులకు అవగాహన



రూ.10 నాణేలను దుకాణాలకు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్‌బీఐ ఆదేశాల మేరకు కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని వస్త్ర దుకాణాల్లో వినియోగదారులకు సోమవారం రూ.10 నాణెంపై అవగాహన కల్పించారు. రూ.10 నాణెం చట్టబద్ధమైంది.. దాన్ని ప్రజలు రోజువారీ లావాదేవీలకు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ చీఫ్ మేనేజర్ దిలీప్, అధికారిణి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మొత్తం పది దుకాణాలకు వెయ్యి చొప్పున రూ.10 నాణేలను అందజేశారు.



## నీటికి వెళ్తే మృత్యుఒడికి చేరినట్లే

● ప్రమాదకరంగా చందవరం-2 చెరువు ● వేర్వేరు సంఘటనల్లో ఏడుగురి మృతి

దాహార్తి తీర్చుకుందామని ఆ చెరువులోకి దిగితే మృత్యుఒడికి చేరినట్లే. ఇప్పటికే అది చాలామంది పొట్టనబెట్టుకుంది. ఏటా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదు. కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. భవిష్యత్తులో ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండాలంటే చెరువు చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దొనకొండ, న్యూస్‌టుడే:

మండలంలోని చందవరం-2 చెరువును 18 సంవత్సరాల కిందట నిర్మించారు. ఈ చెరువు నుంచి కొనకనమెట్ల, హనుమంతునిపాడు, కనిగిరి, పొదిలి మండలాల్లో 131 గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుంది. గ్రామ సమీపంలోని తారురోడ్డు పక్కనే ఈ చెరువు ఉండటంతో అటుగా వెళ్లేవారు పశు కాపరులు ఎండ సమయంలో ఆ చుట్టు పక్కల నీరు దొరక్క దాహం తీర్చుకుందామని చెరువు నీటికోసం దిగుతారు. సిమెంట్ బిల్లల మీద నీరు నిలిచి ఉండటం వల్ల నాచు పేరుకుపోయి ఉంటుంది. ఆ నాచుపై కాలు వేయగానే చెరువులో పడిపోతారు. 14 అడుగుల ఎత్తులో 40 ఎకరాల విస్తీర్ణంలో తటాకం ఉండటంతో ఈత వచ్చినా పైకి రాలేరు. ఎవరైనా కాపాడాలన్నా అందుబాటులో ఎవ్వరూ ఉండరు. ఆరేళ్ల కిందట మండలంలోని కందులవారిపాలెం గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక గేదెలు చెరువులో దిగటంతో వాటిని తోలేందుకు అందులోకి దిగింది. చిన్నారిని కాపాడేందుకు వాళ్ల అమ్మమ్మ కూడా దిగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. నాలుగేళ్ల కిందట చందవరం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు నీరు తాగుదామని చెరువులోకి దిగి మృతి చెందారు. రామిరెడ్డిపల్లి, కందులవారిపల్లి గ్రామాలకు చెందిన ముగ్గురు గత రెండేళ్లలో ఈ చెరువులో మృత్యువాతపడ్డారు. ఇంతమంది ప్రాణాలు కోల్పోయినా మాకేమి తెలియదన్నట్లు అధికారుల వ్యవహారం ఉంది. గత వైకాపా ప్రభుత్వం చెరువు చుట్టూ ముళ్లతీగ వేసేందుకు రూ.18 లక్షలు మంజూరు చేసింది. టెండర్లకు అధికారులు పిలుద్దామనే సమయంలో నిధులు లేవని చెప్పటంతో అది కాస్తా మరుగున పడిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు చుట్టూ ముళ్లకంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చెరువు చుట్టూ కట్ట లోపలి భాగంలో ఉన్న సిమెంట్ రివిట్‌మెంట్

### ప్రతిపాదనలు పంపాం..

మూడు సంవత్సరాల క్రితం రూ.18 లక్షల నిధులు మంజూరయ్యాయి. కానీ వాటిని ఉన్నతాధికారులు రద్దు చేయటంతో కంచె వేయలేకపోయాం. జడ్పీ నిధుల్లో రూ.20 లక్షలు కంచె వేయటానికి మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు మొదలు పెడతాం. అప్పటివరకు చెరువులోకి ఎవ్వరూ దిగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.– శ్రీకాంత్, ఎన్‌ఏపీ ఏఈ

## రూ.2 లక్షలకు కలశం కైవసం

పామూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని వాసవీ కన్యకాపరిమేశ్వరి అమ్మవారి దసరా నవరాత్రుల్లో పూజలందుకున్న వెండి కలశాన్ని వేలంపాటలో గాథంశెట్టి గురునారాయణ రూ.2,08,116 లకు దక్కించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆర్ తులసి నందన్‌స్వామి, ఛైర్మన్ వై. బాలకొండలరావు కలశాన్ని గురునారాయణకు అందజేసి పూల మాలలు, శాలువతో సత్కరించారు.

## విశ్రాంత ఎంఈవో మృతికి సంతాపం

తాళ్లూరు, న్యూస్‌టుడే : ఉమ్మడి ప్రకాశం జిల్లా తాళ్లూరు, అద్దంకి, బల్లికురవ మండలాల విద్యాశాఖాధికారిగా పని చేసి పదవీ విరమణ పొందిన యలగాల సత్యనారాయణ సోమవారం ఉదయం మృతి చెందారు. ఆయన మరణం పట్ల తాళ్లూరు మండల ఏపీపీఎఫ్ శాఖ గౌరవాధ్యక్షులు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, అధ్యక్షులు జి. నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు.

## మక్కెన యానాదయ్యకు నివాళి

టంగుటూరు, న్యూస్‌టుడే: మండలంలోని జమ్ములపాలెం తెదేపా నాయకులు మక్కెన యానాదయ్య దశదిన కర్మకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఏపి మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యలు హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు



పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ



హనుమపురం వాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో మహాలక్ష్మి

## పొంగిన వాగులు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: నాగులుప్పలపాడు - తిమ్మనపాలెం, నిడమనూరు - కొత్తకోట మధ్య హనుమాపురం వాగు; ఉప్పుగుండూరు-మాచవరం మధ్య నాగన్న వాగు పొంగి రహదారిపై ప్రవహించాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇంకొల్లు రోడ్డులోని ఎస్సీ కాలనీవాసులను జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరానికి తరలించారు. జేసీ గోపాలకృష్ణ సందర్శించి... అన్ని వసతులు కల్పించాలని సూచించారు. తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో మహాలక్ష్మి, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



చెరువును తలపిస్తున్న హైవే సర్వీస్ రోడ్డు

## కాలువలా మారిన హైవే

మద్దిపాడు: గుంటూరు వైపు వెళ్లే జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో... వడ్లర కాలనీ నుంచి పావు కిలోమీటరు మేర నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కెనరా బ్యాంకు నుంచి సాయిబాబా మందిరం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. ఒంగోలు వైపు వెళ్లే మార్గంలో పాటు, వెల్లంపల్లి - తాళ్లూరు రహదారిలోనూ చిక్కులు తప్పలేదు. ముస్లిం కాలనీ, అరుంధతీ నగర్, ఎస్సీ కాలనీలో అంతర్గత దారులు కాలువల్లా మారి బయట అడుగుపెట్టలేని దుస్థితి నెలకొంది.



మద్దిపాడు: ఎస్సీ కాలనీలో ఇలా...

## తీర గ్రామాల్లో అధికారుల పర్యటన

కొత్తపట్నం, న్యూస్‌టుడే: తీరంలోని పల్లెపాలెంలో అధికారులు పర్యటించారు. అలల ఉద్ధృతి ఎక్కువగా ఉండడంతో అక్కడకు వచ్చిన పర్యాటకులను వెనక్కి పంపించారు. ఈతముక్కల సమీపంలోని బకింగ్‌హాం కాలువలో వరద ప్రవాహాన్ని పరిశీలించారు. సంకువానికుంట సమీపంలో రహదారిపైకి నీరు చేరిందన్న సమాచారంతో... రెవెన్యూ, పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల వారిని తరలించేందుకు వీలుగా పునరావాస కేంద్రాలు సిద్ధం చేసినట్లు తహసీల్దార్ పి.మధుసూదనరావు తెలిపారు.

## కాలువల్లో పూడిక తీత

చీమకుర్తి: పురపాలక సంఘం పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చర్యలు చేపట్టారు. కమిషనర్ వై. రామకృష్ణయ్య సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. మహా ప్రస్థానం తదితర ప్రాంతాల్లో... కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను జేసీబీతో తొలగింప జేశారు.

## రూ.10 నాణెంపై అపోహలు వద్దు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రూ.పది నాణెంపై అపోహలు సరికాదని... ఎప్పటికైనా దీనిని వినియోగించవచ్చని బ్యాంకు అధికారులు తెలిపారు. ఈ మేరకు కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో నగరంలోని పలు వస్త్ర దుకాణాల్లో వినియోగదారులకు సోమవారం అవగాహన కల్పించారు. చీఫ్ మేనేజర్ దిలీప్, అధికారిణి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పది దుకాణాలకు వెయ్యి చొప్పున రూ.10 నాణేలు అందజేశారు.



దుకాణదారులకు నాణేలు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

# అయిదేళ్ల నిర్లక్ష్యం... నగరానికి వరద భయం!

◆ కాలువల బాగును గాలికొదిలేసిన వైకాపా పాలకులు

న్యూస్‌టుడే - మంగమూరు రోడ్డు, రాజీవ్ గృహకల్ప (ఒంగోలు నగరం)

భారీ వర్షంతో నగర రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. గత పాలకులు మురుగు పారుదల వ్యవస్థను పూర్తిగా గాలికొదిలేయడంతో... లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి సమస్య నెలకొంది. అల్పపీడన ప్రభావంతో మరో మూడు రోజులు వానలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో ఆయా కాలనీల వారు ఆందోళన చెందుతున్నారు.

### కనీస నిర్వహణా కరవు...

గత వైకాపా ప్రభుత్వం నగరంలోని అంతర్గత కాలువల నిర్వహణను పూర్తిగా విస్మరించింది. ప్రధాన కాలువలను పూర్తిస్థాయిలో బాగుచేయించిన దాఖలాలూ లేవు. శివారు కాలనీలతో పాటు, విస్తరిస్తున్న ప్రాంతాల్లో కొత్తగా నిర్మాణాలు చేపట్టిందీ లేదు. విలీన పంచాయతీల సంగతి సరేసరి. ఈ కారణంగా మురుగు, వరద పోయే మార్గాలు మూసుకుపోయి వర్షం పడిన ప్రతిసారీ సమస్య నెలకొంటోంది. 2022 అక్టోబరులో కురిసిన భారీ వానలకు... లోతట్టు కాలనీల వారు మూడు రోజుల పాటు ఇళ్లు వదిలి బయట తలదాచుకోవాల్సి వచ్చింది. తరువాతైనా ఆయా ప్రాంతాలపై దృష్టి సారించింది లేదు. కొప్పోలు రోడ్డులో కాలువ లేక ఇందిరమ్మకాలనీ, ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్‌గృహకల్ప పరిసర ప్రాంతాల్లోని వాడుక నీరంతా రహదారి పైకి చేరి నిత్యం సమస్య తలెత్తుతున్నా పట్టించుకోలేదు. కర్నూలు రోడ్డులో పాత రంగుల కంపెనీ నుంచి పేర్నమిట్ట వరకు ఇరువైపులా కాలువలు మూసుకుపోయినా ఇటుగా చూసింది లేదు.



భాగ్యనగర్ నాలుగో లైన్‌లో పరిస్థితి

యాభై డివిజన్లుగా విస్తరించిన నగరంలో 2019-24 మధ్య కాలువల నిర్మాణానికి వెచ్చించింది కేవలం రూ. 36.73 కోట్లు మాత్రమే. ఆ మొత్తంతో 280 పనులు చేపట్టినట్లు దస్త్రాల్లో చూపుతున్నా క్షేత్రస్థాయిలో ఆ ప్రభావం నామమాత్రంగానైనా కనిపించడం లేదు. తెదేపా కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లో ఈ కాస్త పనులూ చేపట్టలేదన్న విమర్శలు ఉన్నాయి.



సోనియాగాంధీ నగర్ రహదారిలో నిలిచిన వర్షం నీరు

### ముఖ్యమైనవీ విస్మరించారు...

నగరంలో మురుగు, వరద బయటకు పోయేందుకు ఉత్తరం వైపున్న పోతురాజు కాలువ, దక్షిణంలో ఉన్న నల్లకాలువలే ఆధారం. వైకాపా పాలకులు ఈ రెండింటి అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారు. పోతురాజు కాలువ అభివృద్ధి పేరిట కొద్ది రోజులు పనులు చేసి ఆపేయడంతో ఇప్పుడు మరిన్ని సమస్యలు తలెత్తుతున్నాయి. నల్లకాలవకు సమీపంలో బైపాస్ రోడ్డు పక్కనున్న వరద నీటి కాలువ తూటాకు, వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో డీమార్ట్, భాగ్యనగర్ ప్రాంతాల్లో నీరు నిలిచిపోతోంది. ప్రస్తుత వర్షాలకు భాగ్యనగర్ అయిదో లైన్‌లో ఇళ్లలోకే నీరు చేరింది. యుద్ధప్రాతిపదికన జేసీబీతో పూడిక తొలగించడంతో కొంత ఉపశమనం లభించింది. మిగతా ప్రాంతాల్లోనూ ఈ తరహా చర్యలు చేపడుతున్నారు.



అరవై అడుగుల రోడ్డులో పోతురాజు కాలువ వంతెనను పరిశీలిస్తున్న మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు



వరద నీటిని పంపేందుకు కచ్చా కాలువ తవ్వకం

### హెల్ప్‌లైన్ ఏర్పాటు

మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో... నగరంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. అత్యవసర సమయంలో సేవలందించేందుకు వీలుగా 24 గంటలూ పనిచేసేలా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన వారు 1800 425 2858, 08592 232858 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

## 'పల్లె పండగ'పై సమీక్ష

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: మండలంలో పల్లె పండగ వారోత్సవాల నిర్వహణపై ఎంపీడీవో డి.సురేష్‌బాబు... సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో అభివృద్ధి పనులకు రూ. 5 కోట్లు కేటాయించారని... ఇందులో రూ. 3.6 కోట్లతో సీసీ రోడ్లు, రూ. 1.40 కోట్లలో కాలువల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. 16, 17 తేదీల్లో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ఆయా పనులకు భూమిపూజ నిర్వహిస్తారన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ బి.విజయ, జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, తెదేపా మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ఈవోఆర్డీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రూ.15 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఒంగోలు నియోజకవర్గంలో రూ. 15 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. గుండాయపాలెం, దేవరంపాడు దళితవాడ, దేవరంపాడు, బొద్దులూరివారిపాలెం గ్రామాల్లో రూ. 1.40 కోట్లతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణంతో పాటు, గోకులాలు, పండ్లతోటల సాగు, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు. సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజా సమస్యలపై నివేదిక అందజేయాలన్నారు. తాగునీరు, కాలువలు, వీధి దీపాలపై ఎక్కువగా సమస్యలు వస్తున్నాయని... రెండు నెలల్లో వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని తెలిపారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, ఎంపీడీవో రాజశేఖర్, ఈవోఆర్డీ బాలచెన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బి.వంశీకృష్ణారెడ్డి, పీఆర్ ఏఈ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బొద్దులూరివారిపాలెంలో సీసీ రోడ్ల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

## పల్లె ప్రగతికి శ్రీకారం

మద్దిపాడు, న్యూస్‌టుడే: 'పల్లె పండగ' పేరిట గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తెలిపారు. ఏడుగుండ్లపాడులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని రూ. 20 లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. మండలంలో రూ. 5 కోట్లతో... సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మద్దిపాడులోని ఇస్లాంపేట, క్రిస్టియన్‌పాలెంలో రూ. 1.20 కోట్లు; వెల్లంపల్లిలో రూ. 20 లక్షలు; దొడ్డవరంలో రూ. 50 లక్షలు; తెల్లబాడులో రూ. 30 లక్షలు; ఇనమనమెళ్లూరులో రూ. 40 లక్షలు; బసవన్నపాలెంలో రూ. 30 లక్షలతో చేపట్టనున్న పనులకు భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో తెదేపా మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి స్వాములు, డీఆర్‌డీవో అధికారి వసుంధర, డీఈ కృష్ణమోహన్, ఎంపీడీవో జ్యోతి, మాజీ సర్పంచి నాగేశ్వరావు, వెంకటస్వామి, రమేష్, శ్రీను, అంకారావు; సర్పంచులు శిల్ప సౌందర్య, మద్దిరాల వెంకటేశ్వర్లు, అనిల్‌కుమార్, ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యురాలు భవాని, ఎంపీపీ అరుణ తదితరులు పాల్గొన్నారు. జోరువానలోనూ ఎమ్మెల్యే ఆయా కార్యక్రమాలను కొనసాగించారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సంతనూతలపాడు, న్యూస్‌టుడే:

?: ఎస్సీ కాలనీకి తాగునీటి సరఫరా సరిగా లేక ఇబ్బందులు పడుతున్నాం. – జి.ఇసాకు, కాలనీవాసి

✓: పరిశీలించి... సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – డి.సురేష్‌బాబు, ఎంపీడీవో

## మహిళా సంఘాల ఆందోళన

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలని కోరుతూ మహిళా సంఘాలు ఆందోళన చేపట్టాయి. మద్యం దుకాణాల లాటరీ తీస్తున్న అంబేడ్కర్ భవన్‌కు వెళ్లేదారిలో ఐద్వా, పీవోడబ్ల్యూ సంఘాలకు చెందిన కంకణాల రమాదేవి, పి.పద్మ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. భవన్ వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో రహదారిపై బైఠాయించారు. బారికేడ్లను తోసుకుని వెళ్లే ప్రయత్నం చేయగా అదుపులోకి తీసుకుని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

## దివ్యాంగ జంటలకు నిశ్చితార్థం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్‌లో ఆశ్రయం పొందుతున్న దివ్యాంగ జంటలకు సోమవారం నిశ్చితార్థ వేడుక నిర్వహించారు. మొత్తం నాలుగు జంటలకు... నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, రాజేశ్వరి దంపతులు నూతన దస్తులు బహూకరించారు. 18న వీరి వివాహం ఘనంగా నిర్వహించనున్నట్లు మారెళ్ల సుబ్బారావు తెలిపారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ - సవిత; కొమ్మి రమణయ్య - రాజేశ్వరి దంపతులు, మండవ లావణ్య, తమ్మిశెట్టి రమాదేవి పాల్గొని కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు షేక్ సర్దార్‌బాషా, షహనాజ్ పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న ట్రస్ట్ సభ్యులు, అతిథులు

## జడ్పీ సీఈవో పరిశీలన

సంతనూతలపాడు: ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి బి.చిరంజీవి సోమవారం సందర్శించారు. దస్త్రాలు పరిశీలించారు. పల్లె పండగ వారోత్సవాల నిర్వహణపై ఎంపీడీవో డి.సురేష్‌బాబుకు పలు సూచనలు చేశారు.

## కార్యకర్త మృతికి సంతాపం

మద్దిపాడు: గార్లపాడుకు చెందిన తెదేపా మండల ప్రధాన కార్యదర్శి ముత్తనపల్లి రామలింగం సోదరుడు సోమలింగం సోమవారం మృతి చెందారు. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు.

## మాలధారణకు శ్రీకారం

చీమకుర్తి, న్యూస్‌టుడే: కార్తిక మాసం సమీపిస్తున్న నేపథ్యంలో అయ్యప్ప మాలధారణకు భక్తులు శ్రీకారం చుట్టారు. సోమవారం... చీమకుర్తి హరిహర క్షేత్రంలో సుమారుగా యాభై మంది మాలలు ధరించారు. క్షేత్రంలోని అయ్యప్ప ఆలయంలో గోపాల్ గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## 'నాడు-నేడు'... అసంపూర్తి బడి!



త్రోవగుంట ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల నిర్మాణం తీరిది. నాడు - నేడు రెండో విడత కింద బడి భవనం ఏర్పాటుకు రూ. 54 లక్షలు కేటాయించారు. కొంత మేర పనులు చేశాక నిధుల కొరత తలెత్తడంతో... గత ఏడాది నవంబరు నుంచి ఇలా అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం ఇక్కడ 30 మంది పిల్లలు ఉండగా... సామాజిక భవనం వరండాలో పాఠాలు బోధిస్తున్నారు. చిన్నపాటి వర్షం పడినా ఇబ్బందులు తలెత్తుతున్నాయని... నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, త్రోవగుంట (ఒంగోలు గ్రామీణం)



రాజీవ్‌గృహకల్పలో దుస్థితి

## మురుగుతోనే సావాసం





తొమ్మిదో డివిజన్‌లో భాగంగా ఉన్న జర్నలిస్టు కాలనీ, రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీల ప్రజలు... కనీస వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు. ఏళ్లుగా వందలాది కుటుంబాలు నివాసముంటున్నా అంతర్గత రహదారులు, కాలువల నిర్మాణం చేపట్టలేదు. దీంతో రోడ్లపైనే మురుగు నిలిచి సమస్య నెలకొంటోంది. దుర్వాసన, దోమల బెడదతో నిత్యం ఇబ్బందులు తప్పడం లేదని అక్కడివారు వాపోతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత దిగజారుతోందని... రాకపోకలూ సాగించలేని దుస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు

## కొప్పోలు రోడ్డులో కాలువ నిర్మాణానికి చర్యలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కొప్పోలు ప్రధాన రహదారిలో కాలువ నిర్మాణానికి వెంటనే అంచనాలు తయారు చేయాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు... ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో మేయర్ గంగాడ సుజాత, అధికారులతో కలిసి సోమవారం వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. అరవై అడుగుల రోడ్డులో పోతురాజు కాలువకు అడ్డు పడిన వ్యర్థాలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. 9వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ అయిదోలైన్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు బయటకు పోయేలా కచ్చాకాలువ తీయించారు. భారీవర్ష సూచన నేపథ్యంలో ఎక్కడా సమస్య తలెత్తకుండా పారిశుద్ధ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

## పబ్లిక్ నోటీస్

ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు గ్రామ కాపురస్తులు అయిన దుంపా వెంకటేశ్వరరెడ్డి తండ్రి సుబ్బారెడ్డి గారు నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యులుదాఖలా ఆస్తిని గురించి నా క్లయింటు గారు అయిన దుంపా వెంకటేశ్వరరెడ్డి గారు ఈదర మాధవి అను వారిపై దావా నెం. 237/2023 దావాలు దకలు పరిచి యున్నారు. సదరు దావా ఒంగోలు 1వ అధనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టునందు పెండింగులో వున్నది, కాగా షెడ్యులు ఆస్తిని సిటి యూనియన్ బ్యాంకు వారి వద్ద తనఖా వుంచినారని తెలిసి ఐ.ఎ.నెం. 723/2023 ద్వారా బ్యాంకు వారిని పార్టీగా చేర్చవలసినదిగా నా క్లయింటు పిటీషన్ దాఖలు చేసి యున్నారు. సదరు దావాను మభ్యపరిచి కొందరు దిగువ షెడ్యూలు ఆస్థిని అమ్మజూపుతున్నట్లు నా క్లయింటుకు తెలియవచ్చింది. కావున ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని నా క్లయింటు దకలు పరిచిన దావా పెండింగులో వుండగా ఎవరు ఎటువంటి లావాదేవీలు జరిపిన అట్టి లావాదేవీలు మా క్లయింటుకు గల జాయింటు హక్కును బద్ధపరచజాలవని ఇందుమూలముగా తెలియపరచటమైనది.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రేషన్, సంతనూతలపాడు గ్రామం, గంగవరం శివారు, సర్వే నెం. 997/1, డోరు నెం. 3-90 72 గదుల విస్తీర్ణమునకు స్థలమునకు హద్దులు. తూర్పు: పంచాయితీ వారి రోడ్డు, దక్షిణం: షేక్ మౌలాలి వారి స్థలము, పడమర: కంకిపాటి పద్మావతి, ఉత్తరం: గ్రంది సీతారామయ్య మరియు ఇతరుల స్థలము. ఈ హద్దులలోని 72 గదులు ఖాళీ స్థలము మాత్రము

ఇట్లు.. సం/- A.V. Rama Krishna, M.A., L.L.B. Advocate, Ongole. Cell: 9848624147

## కొప్పోలుకు కన్నీటి కష్టం

కొప్పోలు... నగరపాలక సంస్థలో విలీనమైన పంచాయతీ. సాగర్ కాలువ ద్వారా ఇక్కడి చెరువును నింపి గ్రామస్థులకు నీరందించేవారు. 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం నగరంలోని కొత్తపట్నం బస్టాండ్ నుంచి నేరుగా పైపులైన్ వేసి రక్షిత జలాల సరఫరాకు చర్యలు తీసుకుంది. అవసరమైన సమయాల్లో చెరువు నీటినీ విడుదల చేసేవారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం... దాన్ని చేపల చెరువుగా మార్చేసింది. గ్రామస్థులు వ్యతిరేకించినా పట్టించుకోలేదు. అప్పటి నుంచి స్థానికులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికైనా దీని అభివృద్ధికి చర్యలు తీసుకుంటే... ఇక్కడున్న 20 వేల జనాభా అవసరాలు తీర్చవచ్చు. గత అయిదేళ్లుగా ఇక్కడి రక్షిత పథకం పంపుహౌస్, మోటార్లు నిరుపయోగంగా ఉన్నాయి. వాటినీ వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం



అభివృద్ధికి నోచని తాగునీటి చెరువు

## మంగమూరు రోడ్డు... సమస్యలు చూడు!

మంగమూరు రోడ్డును ఆనుకుని ఉన్న పలు కాలనీల్లో సమస్యలు తిష్ట వేశాయి. సరస్వతి కళాశాల ఎదుట మురుగు నిలిచి ఇబ్బందులు తప్పడం లేదు. రెవెన్యూ కాలనీ, మరికొన్ని ప్రాంతాల్లో అంతర్గత రహదారులు అభివృద్ధికి నోచక... గుంతల దారుల్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మర్రిచెట్టు నుంచి దత్తసాయినగర్ వరకు సుమారు నలభై వీధి దీపాలు వెలగక... రాత్రివేళ అటుగా వెళ్లేవారు నానా అవస్థలు పడుతున్నారు. వసతుల కల్పన దిశగా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు



రెవెన్యూ కాలనీలో అంతర్గత దారి తీరిది